


- అన్నదాత సుఖీభవ పథకం అమలుకు రూ.4,500 కోట్లు కేటాయింపు.. ఉమ్మడి జిల్లాలో 4.54 లక్షల మంది రైతులకు పథకం ద్వారా రూ.908 కోట్ల లబ్ధి
- తల్లికి వందనం పథకం నిధుల కేటాయింపునకు ఓకే.. ఒకటి నుంచి ఇంటర్ వరకు జిల్లాలో 16.51 లక్షల మంది తల్లులకు ప్రయోజనం. లబ్ధిదారులకు రూ.15 వేల చొప్పున జిల్లా అంతటికి రూ.2,476 కోట్ల వరకు నిధుల అవసరం
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సైతం త్వరలో అమలు చేస్తామని ప్రకటన.. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో 19 లక్షల మంది వరకు ప్రయోజనం



సూపర్.. బడ్జెట్

కూటమి 'పద్దు' పొడుపు





కాకినాడ/రాజమహేంద్రవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పయ్యావుల పద్దు సంక్షేమ మంత్రం జపించింది.బడ్జెట్‌లో ఎన్నికల హామీల అమలుకు పెద్దపీట వేస్తూ ముందుకు కదిలింది. మహిళలు, అన్నదాతల మేలే అసలు సిసలు ప్రాధాన్యంగా భావించి వరాల జల్లు కురిపించింది. ఎప్పుడెప్పుడా అని సూపర్‌సిక్స్ హామీల అమలుకు ఎదురుచూస్తోన్న లబ్ధిదారులకు తీపిక బురు అందించింది. గత వైసీపీ ప్రభుత్వం అలవిమాలిన అప్పులతో ఖజానాను గుల్ల చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించినా.. ఆర్థిక క్రమశిక్షణకు కట్టుబడుతూ ఇచ్చిన హామీల అమలుకు నిధుల విదిలింపుతో తమది చేతల ప్రభుత్వమని విత్తమంత్రి చూపించారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మహిళల ఉచితబస్సు ప్రయాణానికి త్వరలో శ్రీకారం చుడుతున్నామని ప్రకటించి పేద, మధ్య తరగతి వర్గాలను ఉత్సాహపరిచారు. వ్యవసాయానికి తూట్లు పొడిచి అన్న దాతల సిరిని అటకెక్కించిన గత వైసీపీ ప్రభుత్వ పాతకానికి చరమగీతం పాడుతూ తిరిగి ఎన్టీఆర్ జలసిరి పథకానికి బడ్జెట్‌లో ఊపిరిపోశారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి రాష్ట్రబడ్జెట్ సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా వికసించింది. బడ్జెట్ ప్రకటన మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒక్క అన్నదాత సుఖీభవ పథకం అమలుకే రాష్ట్రప్రభుత్వం 4.54 లక్షల మంది రైతులకు రూ.908 కోట్ల లబ్ధి జరగనుంది.

అన్నదాతలకు ఆనందం..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీడీపీ సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని మేనిఫెస్టోలో ప్రకటించింది. ఇందులో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం దగాతో మోసపోయిన అన్నదాతలను ఆదుకుంటామని ప్రకటించింది. అర్హులైన ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.4,500 కోట్లు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 4.54 లక్షల మంది రైతులకు పథకం ద్వారా రూ.908 కోట్ల లబ్ధి చేకూరనుంది. కాకినాడ జిల్లాలో 1.86 లక్షల మంది అన్నదాతలకు రూ.370 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 1.21 లక్షలు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1.65 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. సున్నా వడ్డీ రుణాలకు బడ్జెట్‌లో రూ.628 కోట్లు ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో 3.01 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. ఇందులో ఒక్క కాకినాడ జిల్లాలో 96,383మంది అన్నదాతలకు మేలు జరగనుంది. వీరంతా రూ.22 కోట్ల వరకు వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. అన్నదాతలకు అండగా నిలబడేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని అమలు చేసింది. పైసా ఖర్చు లేకుండా ఉచితంగా రైతులకు బోర్లు కొట్టించింది. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వంలో తిరిగి ఎన్టీఆర్ జలసిరి పథకానికి ఊపిరిపోసింది. రూ.50 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. దీంతో తిరిగి అన్నదాతలకు మంచి రోజులు వచ్చినట్లయింది.

తల్లికి వందనమే..

బడ్జెట్‌లో తల్లికి వందనం పథకానికి నిధులు కేటాయిస్తున్నట్టు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల ప్రకటించారు.దీంతో లక్షల మంది పేద, మధ్య తరగతి తల్లుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఎన్నికలకు ముందు టీడీపీ ఈ పథకాన్ని ప్రకటించింది. తాము అధికారంలోకి రాగానే తల్లికి వందనం కింద ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు పిల్లలను బడులకు పంపే తల్లులకు ఏటా రూ.15 వేల చొప్పున ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు బడ్జెట్‌లో ఈ పథకానికి ప్రాధాన్యం కల్పించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 16.51 లక్షల మంది పిల్లలకు సంబంధించి వారి తల్లులకు ఆర్థిక ప్రయోజనం కలగనుంది. ఇందుకు ఒక్కో విద్యార్థికి ఏటా రూ.15 వేల చొప్పున ఉమ్మడి జిల్లాకే ఏకంగా రూ.2,476 కోట్ల వరకు నిధుల అవసరం.ఇందులో ఒక్క కాకినాడ జిల్లా చూసుకుంటే 6.20 లక్షల మంది పిల్లలకు ప్రయోజనం కలగనుంది. ఒక్క కాకినాడ జిల్లాకు చూస్తే ఆర్థిక భారం రూ.930కోట్ల వరకు ఉంది.

ప్రకృతి సాగుకు పండగే..

ఉమ్మడి జిల్లాలో ఏటా ప్రకృతిసాగు విస్తీర్ణం పెరుగుతోంది.ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహానికి రూ.422 కోట్లు కేటాయించింది. దీంతో ఈ విధానం కింద సాగుచేసే రైతులకు ఆర్థిక సహకారం అందనుంది. ఉమ్మడి జిల్లాలో వరి, ఇతర వాణిజ్య పంటలు దాదాపు పదివేల ఎకరాల్లో ప్రకృతి సాగు కింద ఉన్నాయి. కాకినాడ నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని, దీనికి మరింత కట్టుబడి ఉంటామని ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రక టించింది. దీంతో స్మార్ట్‌సిటీకి మరింత ఆర్థిక దన్ను లభించనుంది. రూ.50 వేల నుంచి 99,999 మంది జనాభా ఉన్న రెండో తరగతి పట్టణాల్లో జీఐఎస్ ఆధారిత బృహత్తర ప్ర ణాళికల రూప కల్పన చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో మండపేట, రామచంద్రపురం,పిఠాపురం తది తర పట్టణాలకు మహర్దశ పట్ట నుంది.ఈ ప్రణాళికతో పట్టణాల్లో ప్రజల జీవన విధానం, భవిష్యత్తులో పెరగబోయే ట్రాఫిక్‌కు పరిష్కారం, భవిష్యత్తు అభివృద్ధిపై ప్రణాళికలతో మరింత మెరుగుపడనున్నాయి.

- రాష్ట్ర బడ్జెట్‌లో వరాల జల్లు
- సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి
- సూపర్‌సిక్స్ హామీలకు పెద్దపీట
- మళ్లీ ఎన్టీఆర్ జలసిరి
- నగరాల అభివృద్ధి చర్యలు
- 'తూర్పులో ప్రత్యేక బెటాలియన్
- చింతలపూడికి ప్రాధాన్యం
- రహదారులు మార్చికి రెడీ

ఇక రైట్‌రైట్..

గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా ఆర్టీసీ ఛార్జీలను పెంచేసి పేదల నడ్డివిరగ్గొట్టింది. కొద్ది పాటి దూరానికే షాక్ కొట్టే ఛార్జీలు వసూలు చేసింది.బయట పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ నేపథ్యంలో ఇంటిని నడిపే ఇల్లాలి సంక్షేమం కోసం ఎన్నికలకు ముందు టీడీపీ ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రకటించింది. కూటమిని గెలిపిస్తే జిల్లాలో ఎక్కడినుంచి ఎక్కడికైనా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా పథకం అమలు చేస్తామని హామీఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈ పథకాన్ని త్వరలో అమలు చేయనున్నట్టు బడ్జెట్ ప్రసంగం సందర్భంగా మంత్రి పయ్యావుల ప్రకటించారు.ఈ పథకంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 25.52 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కిందకు రానున్నారు. వీరిలో ఒక్క కాకినాడ జిల్లాలో 9.50లక్షల మం దికి ప్రయోజనం జరగనుంది.

రహదారుల నిర్మాణం

రాజమహేంద్రవరంలో మరో ప్రత్యేక పోలీసు బెటాలియన్‌ను ఏర్పాటుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం పరిధిలోని గోదావరిలో నిర్మిస్తున్న చింతలపూడి ఎత్తిపోతల పథకానికి అధిక ప్రాధాన్యత కల్పించారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బీసీలకు ఇళ్ల నిర్మాణానికి ప్రధాని ఆవాజ్ యోజన పథకం కింద రూ.లక్షా 30 వేలు, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.50వేలు ఇవ్వనుంది. దీంతో పేద, మధ్య తరగతి బీసీలకే సొంతిల్లు కట్టుకోవడానికి వెసులుబాటు దొరికినట్టు అయింది. మిగతా జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా తక్కువగా ఉంది.జిల్లాలో రహదారి పనులన్నీ 2025 మార్చినాటికి పూర్తి చేయనుంది.బీసీ సబ్ ప్లాన్‌కు ఏడాదికి రూ.15 వేల కోట్లు ఖర్చు చేయనుంది. బీసీల స్వయం ఉపాధికి ప్రత్యేక పథకాలు తీసు కుని రానున్నట్టు ప్రకటించారు.అభివృద్ధిపరంగా రోడ్లు, డ్రెయిన్లు,భవనాలు నిర్మించనున్నారు. ఉమ్మడి జిల్లాలో ముఖ్యమైన రోడ్లన్నీ వచ్చే మార్చిలోపు నిర్మించడానికి నిధులు కేటాయించారు. జిల్లా కేంద్రాల నుంచి మండల కేంద్రాలన్నింటికీ డబుల్ లేన్ రోడ్ల నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. గోదావరి జిల్లాలకు అన్నం పెట్టే ఇరిగేషన్ సిస్టమ్ అభివృద్ధికి భారీగానే నిధులు కేటాయించినట్టు అధికారులు చెబుతున్నారు. తాము డెల్టా కాలువల అభివృద్ధితో పాటు గోదావరి ఏటిగట్లు, పొలాలు కోతలకు గురికాకుండా గ్రోయిన్ల నిర్మాణ ప్రతిపాదనలు పంపామని,ఈసారి భారీగా నిధులు కేటాయించనున్నట్టు సమాచారం. ఒకట్రెండు రోజుల్లో వివరంగా కేటాయింపులొస్తాయన్నారు.

సమగ్రాభివృద్ధికి దోహదం

వాసంశెట్టి సుభాష్, కార్మిక శాఖ మంత్రి



రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి, పేదల సంక్షేమానికి బడ్జెట్ దోహదం చేస్తుంది. కూటమి ప్రభుత్వం జనరంజకమైన బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలుకు ప్రాధాన్యత ఇచ్చారు. ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటూ రాష్ట్ర సమగ్ర అభివృద్ధితో పాటు, పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఈ బడ్జెట్‌తో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

అభివృద్ధి, సంక్షేమానికి వారధి

బండారు సత్యానందరావు, ఎమ్మెల్యే



కొత్తపేట, నవంబరు11(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి సంక్షేమాలకు వారధిగా రాష్ట్ర బడ్జెట్ ఉంది. ఇది ప్రజలకు పూర్తి ఆమోదయోగ్యంగా ఉన్న బడ్జెట్. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిచేందుకు ఈ బడ్జెట్ దోహదపడుతుంది. బడ్జెట్‌లో విద్యా, వైద్యానికి పెద్దపీట వేశారు. తొలి బడ్జెట్‌తోనే రాష్ట్రాభివృద్ధికి బాటలు వేశారు. ఇక అన్ని రంగాలు అభివృద్ధి పథంలో నడుస్తాయి.

అన్ని వర్గాలకు మేలు

దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్యే



ముమ్మిడివరం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని గత వైసీపీ ప్రభుత్వం నష్టాల్లోకి నెట్టివేయడంతో ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయింది. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూర్చే విధంగా ఉంది. అన్ని రంగాలకు ప్రాధాన్యతను ఇస్తూ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్-6 పథకాల అమలుకు నిధులు కేటాయించడం అభినందనీయం. సాగునీరు, సంక్షేమానికి ప్రాధాన్యతను ఇచ్చింది. ప్రజలకు మేలు చేకూర్చే విధంగా బడ్జెట్ ఉంది.

ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం

గిడ్డి సత్యనారాయణ, ఎమ్మెల్యే



పి.గన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు అధిక ప్రాధాన్యం లభించింది. ఎస్సీ, బీసీల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించి పెద్దపీట వేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కుడే తప్ప ఏ వర్గానికి న్యాయం చేయలేదు. నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు మేలు చేసే బడ్జెట్ ఇది. వార్షిక బడ్జెట్ జనరంజకంగా ఉంది. అన్ని వర్గాలకు మేలు చేస్తుంది..

తొలి బడ్జెట్‌తోనే అభివృద్ధి

వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్యే



మండపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని రంగాలకు పెద్దపీట వేసేలా ఉంది. గతంలో వైసీపీ ప్రభుత్వంలో అన్ని రంగాలను నిర్వీర్యం చేయగా కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు అన్ని రంగాలకు మేలు జరిగేలా బడ్జెట్ ప్రవేశపెట్టింది. యువతకు ఉపాధి అవకాశాలు రానున్నాయి.

విద్యాభివృద్ధికి బాటలు వేసిన ఆజాద్

- జేసీ నిషాంతి



నివాళులర్పిస్తున్న జేసీ

అమలాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు విద్యాభివృద్ధికి ముందు చూపుతో బాటలు వేసిన మహనీయునిగా దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాంఆజాద్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. విద్యాభివృద్ధికి, విద్యా వ్యాప్తికి ఆయన అందించిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. అబుల్‌కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని మైనార్టీ సంక్షేమ, జాతీయ విద్యా దినోత్సవాలను సోమవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి జేసీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్రికా విలేఖరిగా జీవితాన్ని ప్రారంభించి విద్యాశాఖ మంత్రిగా పనిచేయడంతో పాటు వివిధ రంగాల్లో ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎన్నో త్యాగాలు చేయడంతో పాటు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్య, బాలికా విద్యలకు పెద్దపీట వేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. స్వాతంత్ర్య సమరంలో జైలు శిక్ష అనుభవించిన ఆయనకు భారత ప్రభుత్వం 1992లో భారతరత్న అవార్డును ఇచ్చి గౌరవించిందన్నారు. విద్యా దినోత్సవాన్ని, మైనార్టీల సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముస్లిం మదపెద్దలను జేసీ సత్కరించి షీల్డులు అందజేశారు. వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి డి.వీరవేణి, ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, సమగ్రశిక్ష సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యంతో పాటు పలువురు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో 198 అర్జీల స్వీకరణ

అమలాపురం టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. ప్రతీ సమస్యకు స్పష్టమైన పరిష్కార మార్గాలు చూపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి జేసీ నిషాంతి జిల్లా రెవెన్యూ అధికారి వి.మదన్‌మోహనరావు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శంకరప్రసాద్ అర్జీలు స్వీకరించారు. అర్జీదారులు తమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ 198 అర్జీలను అందించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అర్జీదారులు అందించిన ఫిర్యాదులకు సకాలంలో పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. డీఈవో శాంతలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, డీఎస్‌వో ఉదయభాస్కర్, సీపీవో వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, డీఐసీ జిల్లా మేనేజర్ టీకేపీ ప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా ఉద్యానవన అధికారి బీవీ రమణ, జిల్లాపశుసంవర్ధక అధికారి డాక్టర్ వెంకట్రావు, డీపీఆర్వో కె.లక్ష్మీనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సఖినేటిపల్లి మండలం మోరి గ్రామంలో తపాల శాఖ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం ఇచ్చినప్పటికీ ఇంత వరకు నిర్మాణ ప్రక్రియ ప్రారంభించకపోవడం పట్ల గ్రామస్తులు కొండా సత్తిబాబు, కడలి వెంకటరత్నం, మంగెన వెంకటేశ్వరరావు తదితరులు అర్జీ అందించారు.



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ నిషాంతి

'వేదాంత' కార్యకలాపాలను అడ్డుకుంటాం'

మూడు దశాబ్దాలుగా ఎస్.యానాం గ్రామాన్ని అభివృద్ధి చేయకుండా వేదాంత ఆయిల్ కంపెనీ నిర్లక్ష్యం చేస్తుందని, స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా అన్యాయం చేస్తుందని ఆరోపిస్తూ ఎస్.యానాం గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. వేదాంత కంపెనీ ఇచ్చిన హామీలు తక్షణం అమలు చేయాలని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నినాదాలు చేశారు. వేదాంత కార్యకలాపాలతో కాలుష్యం పెరిగిపోవడంతో పాటు వ్యవసాయ, మత్స్యసంపద కనుమరుగవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పది రోజుల్లోగా డిమాండ్లను పరిష్కరించకుంటే వేదాంత ఆయిల్ కంపెనీ కార్యకలాపాలను స్తంభింపచేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో అర్జీ అందజేశారు. సర్పంచ్ జోగి రాజరాజేశ్వరి, ఎంపీటీసీ పెట్టా అప్పారావు, మాజీ సర్పంచ్ లంకే భీమరాజు, పులిశెట్టి దొరబాబు, రేవు తిరుపతిరావు, అయితాబత్తుల రాజశేఖర్, పలచోళ్ల బుజ్జి, మన్నే వెంకటేశ్వరరావు, కాండ్రేగుల వెంకటేశ్వరరావు, ఉండ్రు శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో ఫెర్రీ రేవును పునఃప్రారంభిస్తాం

'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన

కె.గంగవరం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి-ముక్తేశ్వరం ఫెర్రీ రేవులో రాకపోకల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్ చెప్పారు. ఆంధ్రజ్యోతి పత్రికలో సోమవారం ప్రచురితమైన 'పంటు కదలదా' వార్తకు ఎంపీడీవో స్పంది ంచారు. సెప్టెంబరు 30న టెండర్లు పిలిచా మన్నారు. అయితే నిబంధనల ప్రకారం పాటలో పాల్గొనే వారికి ఐదు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు. ఈ అంశంపై కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. దీనిపై ఉన్నతాధికారుల నుంచి నిర్ణయం రావాల్సి ఉండటంతో పాట వాయిదా వేశామని చెప్పారు. దీనిపై జిల్లా పరిషత్ వారికి తాము ప్రతిపాదనలు పంపించామని, అక్కడ నుంచి ప్రొసీడింగ్స్ వచ్చాయని చెప్పారు. వారి ఆదేశాల ప్రకారం గత పాటదారుడైన కె.ముంజువరం గ్రామానికి చెందిన శ్రీవెంకటేశ్వరా ఆల్ కేస్ట్ క్వారీ అండ్ బోట్స్‌మెన్ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీ ప్రతినిధి బిక్కిన దుర్గారావుకు నెలకు రూ.7,36,864లకు చొప్పున మార్చి 31, 2025 వరకూ నిర్వహించుకునేందుకు అనుమతులు ఇచ్చారు. ఫెర్రీ మధ్యలో ఉన్న తాత్కాలిక రహదారి నిర్మాణం రేవు నిర్వాహకులే చూసు కోవాలని ఆదేశించినట్లు ఎంపీడీవో శ్రీని వాస్ చెప్పారు. వారం రోజుల్లో పనులు పూర్తిచేసి రేవు ప్రారంభిస్తామని చెప్పారు.



కోటిపల్లి ఫెర్రీ రేవులో పూడిక తొలగిస్తున్న దృశ్యం

'ద్రాక్షారామ'కు భక్తుల తాకిడి





అశ్వత్థనారాయణ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ద్రాక్షారామ, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని రెండో కార్తీక సోమవారం విశేష సంఖ్యలో భక్తులు దర్శించారు. తెల్లవారుజాము నుంచి భక్తుల రాక ప్రారంభం అయింది. విశిష్ట దర్శనం, శ్రీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం క్యూలైన్ల ద్వారా భక్తులు భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకం, మాణిక్యాంబ అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. సామూహిక అభిషేకాలు జరిగాయి. ఆశ్వత్థనారాయణ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఉసిరిక చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ పర్యవేక్షణలో ఆలయాల సిబ్బంది భక్తులకు సేవలు అందించారు. సేవా సంస్థలు, ఎన్‌సీసీ విద్యార్థులు సేవలు అందించారు. భీమేశ్వరాలయానికి తరలివచ్చిన భక్తులకు రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం జరిపారు. అదే విధంగా పైండావారి అన్నసత్రంలో భక్తులకు అన్నదానం జరిగింది. రామచంద్రపురం సీఐ అశోక్ కుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ ఎం.లక్ష్మణ్‌తో పాటు ఇతర ఎస్ఐలు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కోటిపల్లి కిటకిట



కె.గంగవరం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): హరహర మహాదేవ శంభోశంకర అంటూ కోటిపల్లి పుణ్యక్షేత్రం శివనామస్మరణతో హోరెత్తింది. కార్తీక మాసం రెండో సోమవారం భక్తులు వేకువజాము నుంచే గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ ఛాయాసోమేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లక్ష బిల్వార్చన చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ ఈవో భీమశంకరం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్వామియే.. శరణం అయ్యప్ప



కోటనందూరు మండలం బొద్దవరంలో అయ్యప్ప లక్ష పత్రి పూజ చేస్తున్న స్వాములు(ఫైల్)

- స్వామి మాలధారణ నియమ, నిబ్ధతతో ఆధ్యాత్మిక చింతన.. ఆరోగ్యానికి రక్షణ
- 41 రోజులపాటు కఠిన దీక్ష
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో లక్షమంది స్వాములు
- అయ్యప్ప నామస్మరణతో మార్మోగుతున్న గ్రామాలు

కోటనందూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వామిశరణం.. అయ్యప్పశరణం అంటూ స్వా ముల శరణుఘోషతో గ్రామాలు మార్మోగుతు న్నాయి. స్వాముల మాలధారణతో ఆధ్యాత్మిక చింతన భావం పెరుగుతుంది. స్వామి దీక్ష మంచి ఆరోగ్యాన్ని కూడా ప్రసాదిస్తోంది. ఏటా అక్టోబరు, నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో స్వాములు మాలధారణ చేస్తుంటారు. కార్తీకమాసం, ధనుర్మాసం రెండు నెలల్లో మండలి దీక్ష, మకర జ్యోతి దర్శనానికి వెళ్లే భక్తులతో శబరిమల కిటకిటలాడుతుంది. ఈ ఏడాది అధికసంఖ్యలో స్వాము లు మాలధారణ చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో ఒక లక్షమంది స్వామి మాలధారణ చేపట్టారని గురుస్వాములు అంటున్నారు. గతేడాది కంటే ఈఏడాది గ్రామాల్లో సంఖ్య మరింత పెరిగిందని తెలిపారు.

క్రమశిక్షణకు మారుపేరు

స్వామి మాలధారణ 41రోజులపాటు నియమనిష్టలతో ఆచరించే స్వాములు శారీరకంగా, మానసికంగా ప్రశాంతంగా ఉంటారు. ఎంతో సద్బుద్ధి కలిగి ఉంటారు. సత్ప్రవర్తన మంచి ఆలోచనకు తోడ్పాటునిస్తుంది. శాకాహారం తీసుకోవడం, చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా అందరూ ఒక చోట ఉండి పూజలు చేస్తుంటారు. మాలధారణ చేసిన భక్తులు 41రోజుల పాటు కఠోర దీక్ష చేస్తారు. అనంతరం గురుస్వాముల ద్వారా ఇరుముడిని కట్టి కేరళ రాష్ట్రంలో శబరిమలకు వెళ్లి ఇరుముడిని అయ్యప్పకు ఇస్తారు. అక్కడకు వెళ్లలేని స్వాములు ద్వారపూడిలో అందజేస్తారు. అయ్యప్పమాలధారణతో ఆధ్యాత్మిక నెలకొల్పేలా చేస్తున్నారు.

మాలధారణతో ప్రయోజనాలెన్నో..

- ఉదయం, సాయంత్రం చల్లని నీటితో స్నానం చేయడంవల్ల శరీరంలో శక్తి, ఏకాగ్రత పెరుగుతుంది. శిర సాన్నంతో రక్తపోటు తగ్గి మంచి ఆరోగ్యం చేకూరుతుంది.
- శీతాకాలం స్వాములు నల్లటి వస్త్రాలను ధరిస్తారు. నల్లటి వస్త్రాలు వెచ్చదనాన్ని ఇస్తాయి. చలికాలంలో ఇవి శరీరానికి ఉపకరిస్తాయి. స్వాములు శని ప్రభావానికి లోనుకాకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని గురుస్వాములు అంటున్నారు.
- నుదుటన చందనం, విభూది, కుంకుమ పెట్టడంవల్ల చల్లదనంతోపాటు, మానసిక ప్రశాంతత కల్గుతుంది. కాళ్లకు చెప్పులు లేకపోవడంవల్ల నడిచేటప్పుడు చిన్నచిన్న రాళ్ల గువ్వలు తగిలి రక్తప్రసరణ బాగా అవుతుంది.
- శాకాహారంతో ఆరోగ్యకరంగా ఉండడంతోపాటు మంచి దినచర్య అలవడుతుంది.

ఆధ్యాత్మిక చింతన పెరుగుతోంది



స్వామి మాలధారణతో భక్తిభావం పెరిగి గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతన నెలకొంటుంది. స్వామి మాలధారణతో మంచి ఆరోగ్యంతోపాటు ప్రశాంతత ఉంటుంది.

-సిద్దా నానాజీ, గురుస్వామి, గొల్లప్రోలు

● చెడు అలవాట్లకు దూరంగా...




స్వాములు మాలధారణవల్ల చెడు అలవాట్లకు దూరంగా ఉండేందుకు ఉపయోగపడుతుంది. ఆరోగ్యకరంగా మారి క్రమశక్షణగా ఉంటారు.

-అర్లి శ్రీనివాస్, గురుస్వామి, కాకరాపల్లి

ఊపిరిని పట్టే.. న్యుమోనియా!

మేలుకోకుంటే.. ప్రమాదమే!



- అప్రమత్తతోనే దూరం
- ఇది కొవిడ్ లాంటిదే..
- ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్
- నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం
- రోగనిరోధకశక్తి తక్కువైతే వ్యాప్తి
- కఫం, దగ్గు, ఆయాసం లక్షణాలు
- కొవిడ్ జాగ్రత్తలే మేలు
- నేడు ప్రపంచ న్యుమోనియా డే

జీజీహెచ్(కాకినాడ)/రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : న్యుమోనియా.. ఊపిరితిత్తుల్లో వచ్చే ఒక ఇన్‌ఫెక్షన్. దగ్గినప్పుడు, వైరస్‌ల ద్వారాను, బాక్టీరియా ద్వారా కూడా వ్యాప్తి చెందుతుంది. తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. సాధారణ భాషలో న్యుమోనియాను నెమ్ముగా వ్యవహరిస్తుంటారు.ఇది వచ్చిన రోగికి దగ్గు, కఫం, జ్వరం, ఆయాసం వంటివి వస్తుంటాయి. వివిధ రకాలైన పరీక్షల ద్వారా దీన్ని గుర్తించవచ్చు. నాన్ ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా ఇది రావొచ్చు. కొన్ని రకాల పడని వస్తువులు తిన్నా, పడని వాతావరణంలోకి వెళ్లినా ఇది వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. మంగళవారం ప్రపంచ న్యుమోనియా డే సందర్భంగా ప్రత్యేక కథనం..



ఈ లక్షణాలుంటే జాగ్రత్త

మనిషి రక్తంలో ఆక్సిజన్ స్థాయి పడిపోతే వెంటిలేటర్ వరకు వెళ్లే స్థితి ఏర్పడుతుంది. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే కఫం బాగా పడుతున్నా,చలికి బాగా వణుకుతున్నా, బాగా ఆయా సపడుతున్నా, దేహంలో ఎటువంటి తేడాలు కనిపించినా, వెంటనే పల్స్ ఆక్సీమీటర్‌పై పరీక్షించుకుని శాచురేషన్ 85 కంటే తక్కువగా ఉంటే వెం టనే వైద్యుడిని సంప్రదించాలి. అక్కడ చికిత్స ద్వారా ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు.

గుర్తించడం ఎలా...

వైరల్ న్యూమోనియా సోకినపుడు ఎక్స్‌రేలో చిన్న చిన్న మచ్చలుగా కనిపిస్తాయి. ఇవి చిన్నగా ఉంటాయి కాబట్టి చాలా మంది సరిగా గుర్తించలేరు. అప్పుడు సీటీ స్కాన్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అలా కాకుండా పెద్ద మచ్చలా కనిపిస్తే దాన్ని బాక్టీరియల్ న్యుమోనియాగా గుర్తిస్తారు. వైరస్, బాక్టీరియా తేలిన తర్వాత దానికి అనుగుణంగా మెడిసిన్ ఇస్తారు.

చలికాలంలో వైరల్ న్యుమోనియా

చలికాలంలో వైరల్ న్యుమోనియాలు ఎక్కువగా వస్తాయి. సీజన్ ఆరంభం నుంచీ వీటి ప్రభావం కనిపిస్తుంది. బాక్టీరియల్ న్యుమోనియాలు ఎప్పుడైనా రావచ్చు. వ్యాధినిరోధకశక్తి తక్కువగా ఉండేవారికి ఎక్కువగా వస్తాయి. రెండేళ్ల చిన్నారులకు, 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలికంగా స్మోకింగ్ చేసేవారికి, రీనల్ ఫెయిల్యూర్ పేషెంట్, హెచ్‌ఐవీ, దీర్ఘకాలిక వ్యాధులకు స్టెరాయిడ్స్ వాడుతున్నవారికి కూడా రావొచ్చు. వీరితోపాటు కేన్సర్ పేషెంట్లు, ఊపిరితిత్తుల వ్యాధులున్నవారికి, నియంత్రణలేని డయాబెటిస్ రోగులకు న్యుమోనియాలు ఎక్కువగా వస్తుంటాయి.

కొవిడ్ జాగ్రత్తలే...

ఏ రకం నిమోనియాకు అయినా కొవిడ్ జాగ్రత్తలే తీసుకోవాలి. మాస్కు ధరించడం, సోషల్ డిస్టెన్స్ మెయింటైన్ చేయడం, తరచూ చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వంటివి చేయాలి. తుంపర్ల ద్వారా ఇతరులకు త్వరగా వ్యాపించే అవకాశం ఉన్నందున మాస్కు ధరించడం శ్రేయస్కరం అని వైద్యులు చెబుతున్నారు.



కాలుష్యం.. కోనోకార్పస్ చెట్లూ

ఉమ్మడి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో వాహనాల సంఖ్య ఎక్కువ. ఈ నగరాలకు దగ్గర్లో పరిశ్రమలు ఉన్నాయి. వాహనా లతో పాటు ఫ్యాక్టరీల నుంచి వచ్చే వాయు కాలుష్యంతో నిండిన గాలి పీల్చినవారికి న్యుమోనియా సంక్రమించే అవకాశాలున్నాయి. అందు వల్ల వ్యాధినిరోధకశక్తి తక్కువ ఉన్న వారు మాస్కు ధరించడం ఉత్తమం. అలంకారం కోసం, నీడ కోసం రోడ్లకు ఇరువైపులా నాటిన కోనోకార్పస్ చెట్లు పెద్ద నగరాలు, మునిసిపాలిటీల్లో ఎక్కువ. ఈ చెట్ల వల్ల.వాటి పూల పిప్పొడి మనిషి ఊపి రితిత్తుల్లోకి వెళ్లి ఇన్‌ఫెక్షన్ చేరి న్యూమోనియాకు దారితీసే అవకాశాలున్నాయి.కొన్ని కెమికల్స్, రేడియేషన్ వల్ల కూడా న్యుమోనియా రావచ్చు.ఇన్‌ఫెక్షన్ల వల్ల కాకుండా నాన్ ఇన్‌ఫెక్షన్ల వల్ల వస్తుంటాయి.

ముందే మేల్కొంటే మంచిది..

సకాలంలో చికిత్స చేయించుకుంటే న్యుమోనియా పెద్ద జబ్బేమీ కాదు. కానీ నిర్లక్ష్యం చేస్తే మాత్రం మరణానికి చేరువై భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. న్యుమోనియా ఊపిరితిత్తుల్లో ఏర్పడుతుంది.ఈ వైరస్ ఒకేసారి చుట్టుముట్టి ఎక్కువ మందిని ప్రభావితం చేసి మరణం వరకు తీసుకెళ్తుంది.ఈ తరహాలో 2000లో బర్డ్‌ఫ్లూ, 2009లో స్వైన్‌ఫ్లూ, 2018లో నిఫా వైరస్, 2020లో కొవిడ్ వచ్చి ప్రాణాంతకంగా మారి ఎంతో మంది మరణానికి కారణమయ్యాయి.ఇవన్నీ వైరల్ న్యు మోనియా జ్వరాలే.ఇవి కాకుండా సాధారణంగా వ్యాప్తి చెందేవి బ్యాక్టీరియల్ న్యుమోనియా జ్వరాలు.ఇవి వ్యాధినిరోధక శక్తి తక్కువ ఉన్నవారిలో కనబడతాయి.

సకాలంలో వైద్యమే మందు

సకాలంలో న్యుమోనియాకు వైద్యం చేయించుకోకపోతే లోపల ఉన్న ఇన్‌ఫెక్షన్ వల్ల రసిపట్టడం.. ఛాతీలోకి రసి చేరడం, ఒక్కోసారి క్రిములు దేహమంతా వ్యాపిస్తాయి. న్యుమోనియా బాగా ముదిరితే అది రక్తంలోకి చేరుతుంది. దీన్ని సెప్టిసేమియా అంటారు. రక్తంలో నుంచి శరీర ప్రధాన అవయవాలైన కిడ్నీ, లివర్, గుండె, బ్రెయిన్‌కు వెళ్లే అవకాశం ఉంటుంది. దీంతో మల్టీ ఆర్గాన్స్ ఫెయిలై కోమా లేదా ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడతాయి. మల్టీ ఆర్గాన్స్‌కు వెళితే యాంటీ బయాటిక్స్ ఇవ్వడం ద్వారా నయం చేసే అవకాశంఉంది.వ్యాధినిరోధకశక్తి తక్కువగా ఉంటే ఆగస్టులో ఇన్‌ఫ్లు యేంజా వ్యాక్సి న్ లేదా న్యూమోకోకిల్ వ్యాక్సిన్ వేయించుకోవాలి.

వైద్యులేమంటున్నారంటే..

ముందు జాగ్రత్తతో తరిమేయవచ్చు



ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ సకాలంలో వైద్యచికిత్స తీసుకుంటే ప్రాణాంతకమైన న్యూమోనియా జ్వరాన్ని తరిమేయవచ్చు. ఆయాసం అధికంగా ఉన్నా, దగ్గుతో కూడిన కళ్లె పడుతున్నా, ఊపిరి పీల్చుకోవడం కష్టతరమైనా, పల్స్ ఆక్సీమీ టర్ పరీక్ష చేసుకుని శాచురేషన్ 85 కన్నా తక్కువగా ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి. కాకి నాడ జీజీహెచ్‌లో అన్ని సౌకర్యాలు..వెంటిలేటర్ల సదుపాయం ఉంది. - డాక్టర్ సూర్యకుమారి, పల్మనాలజిస్ట్, జీజీహెచ్, కాకినాడ

కొవిడ్ తరహాగానే ఉంటుంది..



అత్యవసరమైతే రాజమహేంద్రవరం బోధనాస్పత్రిలో వెంటిలేటర్లు సిద్ధంగా ఉన్నాయి. కొవిడ్ కూడా న్యూమోనియానే కానీ అది పాండమిక్ కావడంతో మరణాలు పెరిగాయి. న్యుమోనియాను ప్రాథమిక దశలోనే గుర్తించి యాంటీబయాటిక్స్ ఇవ్వడం ద్వారా రోగి కోలుకుంటాడు. న్యుమోనియాను నయం చేయడంలో యాంటీ బయాటిక్స్ ప్రముఖ పాత్ర పోషిస్తాయి.

-డాక్టర్ ఎం.కిరణ్, పల్మనాలజిస్ట్ , జీజీహెచ్, రాజమహేంద్రవరం


ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి నోటిఫికేషన్ విడుదల

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు జిల్లా రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 18 వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఈనెల 19న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఈనెల 21న మధ్యాహ్నం 3గంటలలోపు నామినేషన్లు ఉపసంహరించుకోవాలన్నారు. డిసెంబరు 5న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.

తొలిరోజు నామినేషన్ నిల్

తొలిరోజు సోమవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

ఉషోదయాన..



కార్తీకమాసం సందర్భంగా కొవ్వూరు గోష్పాదక్షేత్రం భక్తజనంతో నిండుగా ఉంది.. ప్రత్యక్ష దేవుడు సూర్యభగవానుడు.. సోమవారం వేకువజామున మెల్లమెల్లగా బయటకు వస్తూ.. గోదారమ్మలో కాసేపు తన వెలుగును ఇలా ప్రసరింపజేసి భక్తులకు కనువిందు చేశాడు.. గోదారమ్మలో లీనమై ముందు చల్లబడ్డాడు.. ఆ తరువాత మెల్లమెల్లగా ఉదయించాడు.. దీంతో భక్తజనం చల్లంగ చూడుస్వామి అంటూ మొక్కుకున్నారు.. ఈ సుందర దృశ్యం చూపరులను ఆకట్టుకుంది.. - కొవ్వూరు

శివోహం

కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. రాజమహేంద్రవరంలో భక్తులు పోటెత్తడంతో పుష్కరఘాట్లు కిటకిటలాడాయి. మహిళలు గోదావరిలో కార్తీకదీపాలు విడిచిపెట్టారు. ద్రాక్షారామ, సామర్లకోట తదితర శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.



రాజమండ్రి పుష్కరఘాట్, కొవ్వూరులో కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు



సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయంలో జ్యోతిర్లింగార్చన పూజలు



ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామివారు



పాదగయ క్షేత్రంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పిఠాపురం పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన సాహితి

రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు సాహితి ఎంపిక

దేవరపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలోని జడ్పీ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఓరుగంటి సాహితి రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు ఓరుగంటి నాగరాజు తెలిపారు. ఇటీవల విజయనగరంలో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనపరచడంతో అండర్-15 ఆంధ్రా క్రికెట్ జట్టుకు ఆమె ఎంపికైనట్టు చెప్పారు. నవంబర్ 21 నుంచి 29 వరకు కటక్‌లో జరిగే జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో సాహితి పాల్గొంటుందని తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లో వడోదరలో జరిగిన రాష్ట్ర జట్టుకు ఎంపికైందని రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పాల్గొన్నట్టు తెలిపారు. దేవరపల్లి మండలం పల్లంట్లలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17ను పశ్చిమగోదావరి జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి మూడోస్థానం సాధించినట్టు తెలిపారు. రాష్ట్రజట్టుకు ఎంపికైన సాహితిని హెచ్‌ఎం శ్రీలక్ష్మి, పీఎంపీ చైర్మన్ వేముల రాజు, ఉపాధ్యాయులు గ్రామస్థులు అభినందించారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్



సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్

కాకినాడ సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటానని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును సోమవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పట్టభద్రుల నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 2లక్షల 60వేలు పట్ట భద్రుల ఓట్లు నమోదు చేయించానని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో 3 లక్షల 50 వేల ఓట్ల నమోదు లక్ష్యానికి చేరుకుంటానన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ఇచ్చిన అవ కాశాన్ని బాధ్యతగా భావించి పనిచేయాలని సూచించారు. త్వరితగతిన అనుకున్న లక్ష్యం పూర్తి చేయాలని అభినందించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మీడియాతో మాట్లాడుతూ పట్ట భద్రుల ఓట్లు నమోదులో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కూటమి ఇన్‌చార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలు, నేతలు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు.

వెయ్యిగుడుల వెలుగు కోసం భక్తి చైతన్యసభ

మామిడికుదురు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వెయ్యి గుడుల వెలుగుకోసం భక్తి చైతన్య ముగింపు సభ అప్పనపల్లి బాలాజీ సన్నిధిలో సోమవారం రాత్రి జరిగింది. ఏపీ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, సినీ పాటల రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, ఎం.ఎం.శ్రీలేఖ తదితరులకు అర్చకులు స్వాగతం పలికారు. ఈసం దర్భంగా వారు మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న దేవాలయాల్లో వెలుగులు విరజిమ్మేలా ప్రజలను చైతన్యవంతులను చేయడానికే వెయ్యి గుడుల వెలుగు కోసం భక్తి చైతన్య సభ కార్యక్ర మం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తెలుగు రాష్ట్రా ల్లోని ప్రముఖ దేవాలయాలను వారు సందర్శిస్తున్నారు. సోమవారం వారంతా అయినవిల్లి ఆలయాన్ని, అంబాజీపేట మండలంలోని ఏకాదశ రుద్రులను దర్శించుకున్నారు. సభలో జొన్నవిత్తుల రచించిన గీతాలను ఆవిష్కరించారు.



అప్పనపల్లి బాలబాలాజీ ఆలయంలో ఏపీ పూర్వ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సినీ పాటల రచయిత జొన్నవిత్తుల, ఎంఎం శ్రీలేఖలకు పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న దృశ్యం



బీసీ హాస్టల్‌లో విచారిస్తున్న బీసీ సంక్షేమాధికారి ప్రసాదరావు

రాజోలు బీసీ హాస్టల్ వార్డెన్ పాండురంగ సస్పెన్షన్

రాజోలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'బీసీ హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ స్పందించారు. రాజోలు బీసీ బాలుర హాస్టల్ వార్డెన్ హెచ్.పాండురంగను సస్పెండ్ చేశామని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి టీవీ ప్రసాదరావు సోమవారం తెలిపారు. బీసీ సంక్షేమాధికారి ప్రసాదరావు విద్యార్థులను హాస్టల్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజోలు బీసీ బాలుర హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్‌గా ముక్తేశ్వరానికి చెందిన వార్డెన్ సీహెచ్ సాయిరామ్‌ను నియమించినట్టు ఆయన తెలిపారు. రాజోలు తహసీల్దారు ప్రసాద్ హాస్టల్‌లోని సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు



హారం సమర్పిస్తున్న దాతలు

సత్యదేవునికి రూ.2.50 లక్షలు విలువైన ముత్యాలు, పచ్చల హారం సమర్పణ



అన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి సోమవారం సుమారు రూ.2.50 లక్షల విలువచేసే బంగారంతో చేయించిన 49 గ్రాముల ముత్యాలు, పచ్చల హారాన్ని హైదరాబాద్‌కు చెందిన తుర్లపాటి అనిల్‌కుమార్ అందజేశారు. దాతను ఈవో రామచంద్రమోహన్ అభినందించారు. ఈ హారంలో 20 గ్రాముల బంగారం, 29 గ్రాముల పెరల్స్ ఉన్నాయని ప్రొటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ తెలిపారు.



దర్శనం అనంతరం సత్యదేవుని సన్నిధిలో సేదతీరుతున్న భక్తులు

రత్నగిరి... భక్త సిరి

కార్తీక సోమవారం సందర్భంగా భక్తజనసంద్రం

ఒక్కరోజు ఆదాయం రూ.80లక్షలు

అన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి కార్తీక సోమవారం పర్వదినాన భక్తులు పోటెత్తారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని తెల్లవారుజామున ఒంటి గంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలను ప్రారంభించారు. సుమారు 70వేల మంది స్వామిని దర్శించుకోగా వివిధ విభాగాల ద్వారా రూ.80 లక్షల ఆదాయం లభించింది. సత్రం గదులు దొరకని భక్తులకు విష్ణుసదన్ హాల్స్ రెండు డార్మెటరీల్లో ఉచిత వసతి ఏర్పాటుచేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. ఈవో రామచంద్రమోహన్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి భక్తులకు సూచనలిచ్చారు. స్వామివారి దర్శనం అనంతరం మహిళలు రావి చెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. సోమవారం 8,359 జంటలు సత్యదేవుని వ్రతం ఆచరించారు.



రాజమహేంద్రవరంలోని అప్సర థియేటర్లో ప్రేక్షకులను పలకరిస్తున్న వరుణ్‌తేజ్

మట్కా... పక్కా మాస్ మూవీ

రాజమహేంద్రవరంలో హీరో వరుణ్‌తేజ్ సందడి

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మట్కా పక్కా మాస్ మూవీ... మెగా అభిమానులను అలరిస్తుందని మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ అన్నారు. మట్కా చిత్రం ప్రమోషన్‌లో భాగంగా సోమవారం ఆయన తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సందడి చేశారు. మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు మెగా అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నగరంలోకి చేరుకుని ఏవీ అప్పారావు రోడ్డు నుంచి అప్సర థియేటర్ వరకు మెగా ర్యాలీ నిర్వహించారు. వరుణ్‌తేజ్ థియేటర్‌లోకి వచ్చి ప్రేక్షకులతో కలిసి ట్రైలర్‌ను తిలకించారు. మట్కా చిత్రం ఈ నెల 14న విడుదల అవుతుందన్నారు. కార్యక్రమంలో చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షుడు ఏడిద బాబీ, అభిమానులు వానపల్లి ఆంజయేయులు (ఫొటో బాబీ), జానీ, సరదా శ్యామ్ బాబు, రాజ్‌కుమార్, భరద్వాజ్ పాల్గొన్నారు.



కలెక్టర్ ప్రశాంతితో సమావేశమైన యువ కలెక్టర్లు

క్షేత్ర స్థాయి అవగాహనే కీలకం

ఐఏఎస్‌లకు శిక్షణలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ శిక్షణలో క్షేత్రస్థాయి అవగాహన అత్యంత కీలకమని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఆలిండియా సర్వీసెస్‌కు ఎంపికై శిక్షణ పొందుతున్న అధికారుల బృందం క్షేత్రస్థాయి కేస్ స్టడీ, పరిశోధనలో భాగంగా జిల్లాలో ఏడు రోజుల పాటు పర్యటించారు. సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పీజీఆర్ఎస్‌ను పరిశీలించారు. బృందంలో యువ ఐఏఎస్‌లు మన్నన్ సింగ్, అనురాగ్ బబెల్, ప్రియారాణి, షాహీదా బేగం, పార్థ్, కశిష్ భక్షి, స్నేహపన్న, జాదవ్‌రావు, నిరంజన్ మహేంద్రసింగ్, తుషార్ నెగి, అతుల్ మిశ్రా ఉన్నారు.

కార్మికుల కష్టానికి...



'ఈ-శ్రమ' సాయం

అసంఘటిత కార్మికులకు వరం

(శంఖవరం-ఆంధ్రజ్యోతి)

అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఈ-శ్రమ' కార్డులు అందిస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 60 లక్షలు జనాభా ఉండగా అందులో 9 లక్షల నుంచి 11లక్షల వరకు అసంఘటిత కార్మికులు ఉంటారని అంచనా. ఇప్పటి వరకు సుమారు 6.11లక్షల మంది కార్మికులు ఇ-శ్రమ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరికి యూనివర్సల్ ఐడింటిఫికేషన్ నంబర్ (యుఐఎన్) వస్తుంది. ఈ-శ్రమ కింద నమోదు చేసుకున్న కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే 2లక్షల ప్రమాద బీమా వస్తుందని అధికారులు చెప్తున్నారు. కొన్ని సంక్షేమ పథకాల గురించి ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం వల్ల వాటి ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. వాటిలో 'ఈ-శ్రమ' కార్డు ఒకటిగా చెప్పుకోవచ్చు. ఈ కార్డు కార్డు పొందడం వల్ల 2లక్షల ప్రమాద బీమాతో పాటు మరెన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అవేంటో చూద్దాం....



ఈ-శ్రమ కార్డ్ అంటే ఏంటంటే:

అసంఘటిత రంగంలో పనులు చేస్తున్న కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక కార్డు. భవన నిర్మాణం, చేతివృత్తుల్లో పనిచేసే కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్, ఇన్సూరెన్సు వంటి సౌకర్యాలు ఉండవు. ఏళ్ల తరబడి పనులు చేస్తున్నా గ్రాట్యుటీ అంటేనే వీళ్లకు తెలియదు. అటువంటి శ్రమజీవుల భవిష్యత్తు భద్రత కోసం, వృద్ధాప్యంలో ఎదురయ్యే ఆర్థిక సవాళ్లను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ కార్డు పేరుతో ఈ పథకాన్ని అమలు చేస్తోంది.

ఎలా నమోదు చేసుకోవాలంటే....

ఈ-శ్రమ కార్డు పొందేందుకు ఆన్‌లైన్‌లో Eshram.gov.inలో నమోదు చేసుకోవాలి.

ముందుగా ఆధార్ కార్డుతో లింకైన మొబైల్ నెంబరుతో రిజిస్టర్ చేసుకోవాలి.

ఆ తర్వాత మొబైల్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్‌చేసి లాగిన్ అవ్వాలి.

అనంతరం అడ్రస్, విద్యార్హతలు వంటి వివరాలు పొందుపరచాలి.

అలాగే ఏపనిలో నైపుణ్యం ఉంది, పని స్వభావంతో పాటు బ్యాంకు అకౌంట్ వివరాలు ఎంటర్ చెయ్యాలి.

ఇక చివరిగా ధ్రువీకరణ కోసం మొబైల్‌కు వచ్చిన ఓటీపీ నమోదు చెయ్యడం ద్వారా ఈజీగా ఈ-శ్రమ కార్డుకు అప్లై చేసుకోవచ్చు.

ఓటీపీ సదుపాయం లేకపోతే బయోమెట్రిక్ ఫింగర్ ప్రింటు, ఐరిస్, బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ వివరాలతో సమీపంలోని కస్టమర్‌కేర్ సెంటర్లో నమోదు చేసుకోవాలి.

ప్రయోజనాలివే

ఈ-శ్రమ కార్డు తీసుకున్న కార్మికులు దురదృష్టవశాత్తు ప్రమాదానికి గురై పాక్షిక దివ్యాంగులుగా మారితే కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష చెల్లిస్తుంది.

అదే శాశ్వత వైకల్యం లేదా మరణం సంభవించినప్పుడు రూ.2 లక్షలు బీమా బాధిత కుటుంబానికి లభిస్తుంది.

ఈ-శ్రమ కార్డు కేవలం ఇన్సూరెన్స్ మాత్రమే కాకుండా వారి పిల్లలకు ఉచిత సైకిళ్లు, పనిముట్లు, కుట్టుమిషన్లు వంటి ఇతర ఆర్థిక సహాయాలు అందుకునే అవకాశం ఉంది.

వీరంతా ప్రయోజనం పొందవచ్చు...

పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, రోజువారీ కూలీలు, వీధి వ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులు, తక్కువ వేతనాలు అనగా.. రూ.15వేలులోపు వేతనాలు అందుకుంటున్న ఉద్యోగులు, పీఎఫ్, ఈఎస్ఐ, ఆదాయపు పన్ను చెల్లించని వారు, రేషనుకార్డుదారులు.... ఇలా 16 నుంచి 59 ఏళ్ళలోపు ఉన్న వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చు.



షాట్‌పుట్‌లో ఫస్ట్

ఆలిండియా సివిల్ సర్వీసెస్ పోటీలకు మాధవి ఎంపిక



అన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ పోటీలకు అన్నవరం దేవస్థానంలో ఫార్మాసిస్టుగా విధులు నిర్వర్తిస్తున్న మాధవి ఎంపికయ్యారు. ఈ నెల 6న గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి షాట్‌పుట్ పోటీల్లో ఆమె ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ నెల 8వ తేదీన విజయవాడలో జరిగిన పోటీలో విజేతగా నిలిచిన వాలీబాల్ జట్టులో సభ్యురాలు. దీంతో ఈ రెండు క్రీడలకు రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించి మరో రెండు నెలల్లో న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా మాధవిని దేవస్థానం ఉద్యోగులు అభినందించారు. ఇప్పటికే ఆమె పలు పోటీల్లో పాల్గొని ఎన్నో పతకాలు సాధించారు. కుటుంబ సభ్యులు, దేవస్థానం ఉద్యోగుల సహకారంతో ఈ విజయాలను సొంతం చేసుకుంటున్నట్టు ఆమె చెప్పారు.



నుజ్జునుజ్జయిన లారీ

సెప్టిక్ ట్యాంక్‌ను ఢీకొన్న లారీ

- ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న సెప్టిక్ ట్యాంక్.. ట్యాంకర్ బోల్తా

దేవరపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వెనుక నుంచి లారీ ఒకదానికి ఒకటి ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం దుద్దుకూరు జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భద్రాచలం నుంచి కాకినాడ జిల్లా పెద్దాపురం వెళ్తున్న ధాన్యం లారీ దుద్దుకూరు సమీపంలో ఎదురుగా వెళ్తున్న సెప్టిక్ ట్యాంకును బలంగా ఢీకొంది. సెప్టిక్ ట్యాంకు ముందు. వెళ్తున్న ఖాళీ ఆయిల్ ట్యాంకును ఢీకొనడంతో ఖాళీ ఆయిల్ ట్యాంకర్ తిరగబడింది. ఈ ఘటనలో ధాన్యం లోడు లారీ డ్రైవర్ రాజు(50) అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు ఖమ్మం జిల్లా భద్రాచలం గ్రామానికి చెందిన వ్యక్తి. మృతదేహాన్ని గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాదగయలో అపచారంపై ఉన్నతాధికారుల సీరియస్

దేవదాయ శాఖ ఉప కమిషనరు విచారణ



రమేష్‌బాబుకు సంఘటనలను వివరిస్తున్న భజరంగదళ్, వీహెచ్‌పీ, హిందూ సంఘాల ప్రతినిధులు

పిఠాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో జరిగిన సంఘటనలపై దేవదాయ శాఖ ఉప కమిషనరు డీఎల్‌వీ రమేష్‌బాబు సోమవారం విచారణ చేపట్టారు. పాదగయలోని హోమ గుండాల్లో హోమ ద్రవ్యాలు కాకుండా దర్శనాల టిక్కెట్లు, రశీదు వేసి దగ్ధం చేయడంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇటీవల పాదగయ క్షేత్రంలో అఘోరాను దుస్తులు లేకుండా దర్శనానికి అనుమతించడం, అన్యమతస్తుడిని విధుల్లో ఉంచి పూజా ద్రవ్యాలను అతడితో నిర్వర్తించడం తదితర అంశాలపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో డీసీ విచారణ చేపట్టారు. పాదగయ అధికారులు, సిబ్బందిని విచారించారు. రికార్డులను పరిశీలించారు. హోమగుండంలో రశీదు, టిక్కెట్ పుస్తకాలను ఎవరి ఆదేశాలతో వేశారో ఆరా తీశారు. పాదగయలో జరుగుతున్న వరుస సంఘటనలు భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నాయని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ, భజరంగదళ్, హిందూ సంఘాల ప్రతినిధులు డీసీని కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీసీ రమేష్‌బాబు మాట్లాడుతూ పాదగయలో ఇటీవల చోటు చేసుకుంటున్న సంఘటనలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణకు వచ్చినట్టు తెలిపారు. రికార్డులను పరిశీలించడంతో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది నుంచి స్టేట్‌మెంట్లు తీసుకున్నట్టు చెప్పారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పవిత్ర కార్తీకమాసంలో ఇటువంటివి జరగడం బాధాకరమని చెప్పారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఉన్నారు.



బీచ్ రోడ్డులో నేమాం సమీపంలో వంతెన వద్ద కోతకు గురైన రోడ్డు, ఉప్పాడ తీరంలో అడ్డుగా విరుగుతున్న కెరటాలు

తీరంలో అలజడి

కెరటాల ధాటికి నేమాం సమీపంలో కోతకు గురైన బీచ్ రోడ్డు

కొత్తపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల కారణంగా సోమవారం కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో సముద్రం కల్లోలంగా మారింది. మధ్యాహ్నం నుంచి తీరం వెంబడి ఈదురుగాలులు బలంగా వీచాయి. కెరటాలు ఉవ్వెత్తున పైకి లేచి బీచ్ రోడ్డును తాకుతున్నాయి. ఉప్పాడ శివారు కొత్తపట్నం నుంచి విద్యుత్ ప్లాంటు, కొమరగిరి జగనన్న కాలనీ వరకు బీచ్ రోడ్డుపైకి అలలు దూసుకువస్తున్నాయి. కొమరగిరి పేదల ఇళ్ల కాలనీ-నేమాం మధ్యలో వంతెనకు సముద్ర కెరటాలు పోటెత్తడంతో వంతెన వద్ద అప్రోచ్ సమీపంలో బీచ్ రోడ్డు కోతకు గురైంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.

కాకినాడ మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లతో ఉప్పాడ, నేమాం బీచ్‌లకు విచ్చేసిన పర్యాటకుల భద్రత నిమిత్తం పహారా ఏర్పాటు చేశారు. పర్యాటకులు సముద్రం లోపలకు వెళ్లకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు.

ఇద్దరు చోరుల అరెస్టు

సామర్లకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే ఇళ్ల తాళాలు పగలకొట్టి విలువైన ఆభరణాలను దొంగిలించడంలో అంతర్జాతీయ నేరస్తులుగా పేరొందిన ఇద్దరు దొంగలను కాకినాడ జిల్లా సామర్లకోట పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సెప్టెంబరు 29న సామర్లకోట మండలం వేట్లపాలెంలోని గుణ్ణం సాయిబాబు మాస్టారు ఇంటిలో చోరీకి గురైన 186.79 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీకృష్ణభగవాన్, సీసీఎస్ సీఐ అంకబాబు వివరాలు తెలిపారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేదికరకు చెందిన జిల్లెల్ల రాకేష్, తణుకు అర్బన్ కొత్తూరుకు చెందిన చావల కృష్ణ.. వేట్లపాలెంలో సాయిబాబు ఇంటిలో చోరీకి పాల్పడ్డారు. 8 బంగారపు గాజులు, 2 జతల చెవిలీలు, 4 ఉంగరాలు, నల్లపూసలతో కూడిన రెండు చైన్లతో బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. సమీప ఇంటిలో సీసీ ఫుటేజీ ద్వారా నమోదైన దృశ్యాలను పోలీసులు సేకరించారు. అందులో లభించిన సమాచారం మేరకు తణుకుకు చెందిన అంతర్జాతీయ దొంగలుగా పోలీసులు గుర్తించారు. ఇప్పటికే 52 చోరీల్లో కేసులు నమోదైన వీరి కదలికలపై పోలీసులు నిఘా ఉంచారు. వారిద్దరినీ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వరుస చోరీలకు పాల్పడడం, పట్టుబడడం, జైలుకు వెళ్ళడం, తిరిగి బెయిల్‌పై విడుదల కావడం, చోరీలకు పాల్పడడంలో వీరిద్దరూ అంతర్జాతీయ దొంగలుగా పోలీసు రికార్డుల్లో నమోదై ఉన్నారన్నారు. బంగారు ఆభరణాలను వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం 5వ ఏజేఎఫ్‌సీఎం కోర్టు ఎదుట హాజరుపర్చనున్నట్టు సీఐ శ్రీకృష్ణభగవాన్ చెప్పారు.





స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, చోరీ జరిగిన తీరును వివరిస్తున్న సీఐ శ్రీకృష్ణ భగవాన్

మార్క్‌ఫెడ్ సమావేశం

మలికిపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అమరావతిలో సోమవారం జరిగిన రాష్ట్ర మార్క్‌ఫెడ్ మొదటి సమావేశంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్, రాజోలు జనసేన పార్టీ సమన్వయకర్త గుండుబోగుల పెద్దకాపు పాల్గొన్నారు. సమావేశంలో మార్క్‌ఫెడ్‌కు సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్టు ఆయన తెలిపారు.

డిసెంబరు 14న జాతీయ లోక్‌అదాలత్..

అమలాపురంటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్ తెలిపారు. లోక్ అదాలత్ కేసులకు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

ఏకాదశ రుద్రులు దర్శనం ఎంతో పుణ్యఫలం

- సినీ గేయ రచయిత, కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం




అంబాజీపేట: ముక్కామలలో రాఘేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ప్రముఖులు
అయినవిల్లి: శ్రీసిద్ధివినాయకుని ఆలయంలో గీతమాలావిష్కరణ దృశ్యం

అంబాజీపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా అయినవిల్లి దేవస్థానం ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ప్రముఖ సినీ గేయ రచయిత, కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, టీటీడీ మాజీ ఈవో, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, ప్రముఖ సినీ సంగీత దర్శకురాలు ఎం.ఎం.శ్రీలేఖ, సంస్కృతాంధ్ర పండితులు పీటీబీవీ రంగాచార్యులు, గురుసహస్రావధాని కడిమెళ్ల వరప్రసాద్, సార్వభౌమ అచ్చతెలుగు అవధాని పాలపర్తి శ్యామలానందప్రసాద్ మండలంలోని ఏకాదశ రుద్రులను దర్శించున్నారు. ప్రతి ఆలయం వద్ద ప్రముఖులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న దేవాలయాల్లో వెలుగులు విరజిమ్మేలా ప్రజలను చైతన్యవంతులను చేయడానికే వెయ్యి గుడుల వెలుగు కోసం భక్తి చైతన్య సభ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇందుల్లో భాగంగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ దేవాలయాలను సందర్శిస్తున్నట్టు చెప్పారు.ఈసందరర్భంగా జొన్నవిత్తుల మాట్లాడుతూ కార్తీకమాసంలో ఏకాదశ రుద్రులను దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలమన్నారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కోనసీమ ఏకాదశ రుద్రులకు సంబంధించి 11రుద్రులకు సంబంధించి 11పాటలను రచన చేస్తానన్నారు. తొలుత అయినవిల్లి శ్రీసిద్ధివినాయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి బయలదేరారు. నేదునూరు, ముక్కామల, వక్కలంక, ఇరుసుమండ, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, కె.పెదపూడి, మొసలపల్లి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, పాలగుమ్మి గ్రామాల్లో ఉన్న రుద్రులను దర్శించుకుని అనంతరం అప్పనపల్లి దేవస్థానానికి చేరుకున్నారు.

శ్రీవిఘ్నేశ్వరస్వామి భక్తి గీతమాలావిష్కరణ

అయినవిల్లి, నవంబరు 11ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో నూతనంగా రాయించిన భక్తి గీతాలను ఆంధ్రప్రదేశ్ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం సోమవారం ఆవిష్కరించారు. ఈభక్తి గీతాల రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, సంగీతం ఎంఎం శ్రీలేఖ, గాయకులు శ్రీకృష్ణ, సాకేత్, అర్చకస్వాములు, సహాయ కమిషనర్, ఆలయ కార్య నిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

కుండలేశ్వరం.. భక్త జనసంద్రం




కాట్రేనికోన మండలం కుండలేశ్వరంలో, ఐ.పోలవరం మండలం మురమళ్లలో పూజలు

కాట్రేనికోన, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరంలో సోమవారం అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో సీనియర్ తెలుగుదేశం నాయకుడు నిమ్మకాయల జగ్గయ్యనాయుడు దంపతులు ఆలయ ప్రాంగణంలో రుద్ర హోమం, మృత్యుంజయ హోమం నిర్వహించారు. వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ దేవతలను భక్తులు దర్శించుకున్నారు. చెయ్యేరు, పి.లక్ష్మివాడ, ఉప్పూడి, కాట్రేనికోన, నడవపల్లి, గెద్దనపల్లి, కందికుప్ప, పల్లంకుర్రు, మగసానితిప్ప శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయానికి తరలివచ్చిన భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన వసతిని నిమ్మకాయల వెంకటరంగయ్య కుమారుడు సీనియర్ తెలుగుదేశం నాయకుడు జగ్గయ్యనాయుడు ఏర్పాటుచేశారు. పది వేల మంది అన్నసమారాధనలో పాల్గొన్నారు. గోకరకొండ సత్తిబాబు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, గంటి సుధాకర్, త్సవటపల్లి నాగు, పీఎస్ఎన్ రాజు, గంగుమళ్ల నిరంజనరావు, ఆకేటి విష్ణుమూర్తి, గంగుమళ్ల భాను, అడపా వెంకటేశ్వరరావు, గంగుమళ్ల రవి, సంసాని నాగేశ్వరరావు, గంగుమళ్ల భద్రరావు పాల్గొన్నారు.

శివనామస్మరణ

ఐ.పోలవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సోమవారం మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పవిత్ర పుణ్యగోదావరిలో స్నానాలాచరించి స్వామి దర్శనానికి తరలివచ్చారు. అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. దాతలు పిన్నమరాజు కాశీవిశ్వనాధరాజు, సాగిరాజు వెంకటరామరాజు ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈనెల15న జ్వాలాతోరణం, అమావాస్య నాడు దీపోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు ప్రకటించారు. అమలాపురం డీఎస్పీ శివరామకృష్ణ దంపతులు వీరేశ్వరుని దర్శించుకున్నారు. ఎదుర్లంకకు చెందిన చిలుకూరి సత్యవతి వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు రూ.10,116లు విరాళంగా ఇచ్చారు. దాతకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి చిత్రపటం అందించి సత్కరించారు.

భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు

ముమ్మిడివరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండో సోమవారం మండలంలోని శైవ క్షేత్రాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. ఉదయం నుంచి భక్తులు పుణ్య నదీ స్నానాలు ఆచరించి శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. ముమ్మిడివరంలోని ఉమాసూరేశ్వరస్వామి ఆలయం, రాజేలంకలోని పార్వతీ సోమేశ్వరస్వామి ఆలయం, కొత్తలంక, కొమానపల్లి, అయినాపురం, అనాతవరం, క్రాపచింతలపూడి, సీహెచ్ గున్నేపల్లి తదితర శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు బారులతీరి స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెంలోని శ్రీహరిసాకేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివెళ్లి స్వామిని దర్శించుకున్నారు.

రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టాలి



మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు

ఉప్పలగుప్తం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో తక్షణమే బీసీ కులగణన చేపట్టాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. బీసీ కులగణనతో ఓబీసీలకు దామాసా పద్ధతి ప్రకారం అన్నిరంగాల్లోను ఇతర వర్గాలకు ఇబ్బంది లేకుండా రిజర్వేషన్ కల్పనకు వీలుకలుగుతుందన్నారు. ప్రత్యేక బడ్జెట్ కేటాయింపుల ద్వారా ఓబీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. సోమవారం ఉప్పలగుప్తం మండలం చీకట్లపాలెంలో ఏఐసీసీ కో ఆప్షన్ సభ్యుడు చీకట్ల అబ్బాయి జన్మదిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అబ్బాయిని సన్మానించారు. అనంతరం పోలిశెట్టి హరిబాబు అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను ఆదాయ వనరుగా చూడకుండా యూనిట్ ధరను తగ్గించాలని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు హామీని వెంటనే అమలు చేయాలన్నారు. కొత్తూరి శ్రీనివాస్, నిమ్మకాయల నాగేంద్రప్రసాద్, దామిశెట్టి జయ, దోనిపాటి విజయలక్ష్మి, జోగి అర్జునరావు, ముషిణి రామకృష్ణారావు పాల్గొన్నారు.

నగర పంచాయతీ కమిషనర్‌గా రవివర్మ



ముమ్మిడివరం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్‌గా పి.రవివర్మ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన జి.వెంకట్రామిరెడ్డి కర్నూలు జిల్లా ఆళ్లగడ్డకు బదిలీపై వెళ్లారు. కాకినాడ పురపాలకసంఘంలో పనిచేస్తున్న రవివర్మను ఇక్కడ కమిషనర్‌గా నియమించారు. రవివర్మ గతంలో ఇక్కడ కమిషనర్‌గా పనిచేశారు. రవివర్మను కౌన్సిలర్లు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.

సాత్విక్‌ను అభినందించిన మెగాస్టార్



అమలాపురం టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఖేల్‌రత్న, అర్జున అవార్డు గ్రహీత రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్‌ను హైదరాబాద్‌లో మెగాస్టార్ చిరంజీవి అభినందించారు. అంతర్జాతీయ షటిల్ బ్యాడ్మింటన్‌లో దేశ ఖ్యాతిని ఇనుమడింప చేస్తున్న సాత్విక్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

‘క్రాప్ హాలిడే ప్రకటిస్తాం’

పి.గన్నవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజులపాలెం శివారు మర్రిపుంతలో రహదారి చెంతనే ఉన్న పంట బోదెలోకి స్థానిక నివాస గృహాలు వారు ఏర్పాటు చేసిన వ్యర్థపు నీరు వెళ్లే గొట్టాలను వెంటనే తొలగించాలని స్థానిక రైతులు డిమాండ్ చేశారు. గొట్టాలు తొలగించకపోతే ఆయకట్టు పరిధిలో ఉన్న రైతులందరూ క్రాప్ హాలిడే ప్రకటిస్తామని హెచ్చరించారు. వినతిపత్రాన్ని రైతులు తహశీల్దార్ పి.శ్రీపల్లవికి అందించారు. బొమ్మిరెడ్డి రామ్మూర్తి, రమణ, అయ్యగారి లక్ష్మీనరసింహామూర్తి, గుత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ విద్యార్థుల ర్యాలీ



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రాజోలు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజోలులో బీసీ హాస్టల్ విద్యార్థులు హాస్టల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. గత రెండు నెలలుగా హాస్టల్‌లో భోజనం సరిగా పెట్టడం లేదంటూ అన్నమైనా పెట్టండి జైలులో అయినా పెట్టండి అంటూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, మెస్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని, పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రాజోలు తహశీల్దార్ ప్రసాద్‌కు ఏఐఎస్ఎఫ్ నాయకులు దేవ రాజేంద్రప్రసాద్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి పెట్టి మెస్ చార్జీల బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 64లక్షల మందికి పోస్టల్ పేమెంట్ ఖాతాలు

ఐ.పోలవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 64లక్షల మందికి ఇండియన్ పోస్టల్ పేమెంట్ ఖాతాలు ప్రారంభించినట్టు అమలాపురం పోస్టల్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ చెప్పారు. సోమవారం మురమళ్ళ బ్రాంచి పోస్టాఫీసును సబ్ పోస్టాఫీసుగా అప్‌గ్రేడ్ చేశారు. నూతన కార్యాలయాన్ని నవీన్‌కుమార్ ప్రారంభించారు. పోస్టాఫీస్ ద్వారా బ్యాంకింగ్ సేవలను అందించేందుకు ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు ఖాతాలు ప్రారంభించామన్నారు. అమలాపురం హెడ్ పోస్టాఫీసు ఆధ్వర్యంలో వారం రోజుల నుంచి ఐపీపీబీ ఖాతాలు ప్రారంభించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. ఇక నుంచి పోస్టాఫీసుల ద్వారా మరిన్ని సేవలు అందిస్తామన్నారు.మురమళ్ళకు చెందిన నూలు వెంకటేశ్వరరావు ఐపీపీబీ ఖాతా తెరవడం ద్వారా సబ్ పోస్టాఫీస్‌లో లావాదేవీలను ఆయన ప్రారంభించారు.

జనసేనలో చేరిన మాజీ ఏఎంసీ చైర్మన్ చినబాబు



అల్లవరం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఏఎంసీ మాజీ చైర్మన్ గునిశెట్టి చినబాబు మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరారు. పవన్‌కల్యాణ్ చినబాబుకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. గతంలో ఏఎంసీ చైర్మన్‌గా, టీడీపీ జిల్లా కార్యదర్శిగా కొనసాగిన చినబాబు అనంతరం వైసీపీలో చేరి ఆ పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తదితరులు మంగళగిరిలో చినబాబును అభినందించారు.

షెడ్యూల్ ప్రకారం డీఎస్సీ పూర్తిచేయాలి

అమలాపురం టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2024 నోటిఫికేషన్‌పై పీడీఎఫ్ ఎమ్మెల్సీలు యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ), కేఎస్ లక్ష్మణరావులు సోమవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో చర్చించారు. వర్గీకరణకు అనుగుణంగా డీఎస్సీ వేయాలనేది రాజకీయ నిర్ణయమని చెప్పారన్నారు. గతంలో ప్రకటించిన మేరకు నవంబరు 6న నోటిఫికేషన్ ఇచ్చి ప్రస్తుత విద్యా సంవత్సరంలో మార్చిలోపు నియామకాలు చేస్తామని చెప్పినట్టు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం డీఎస్సీ నిర్వహించాలని మంత్రికి సూచించామన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచవద్దు..

శాసనమండలిలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలుసుకుని ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించడంతో పాటు శిక్షణలు నిలుపుదల చేయాలని సూచించినట్టు పీడీఎఫ్ ఎమ్మెల్సీలు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా శిక్షణలు యాప్‌ల భారం కొనసాగుతుందన్నారు. తరగతి బోధనలతో ఉపాధ్యాయులను దూరం చేయడం తగదని సూచించామన్నారు.

యూనియన్ బ్యాంకు 106సంస్థాపక దినోత్సవం

అంతర్వేది, నవంబరు11(ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెంలో ప్రతిఒక్క ఖాతాదారునికి సేవలు అందిస్తున్నామనియూనియన్ బ్యాంకు మేనేజర్ యు.రవిబాబు అన్నారు. యూనియన్ బ్యాంకు 106సంస్థాగత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బ్రాంచిఆవరణలో బీఎం కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు.

ప్రజా సమస్యలపై పోరాటం

ముమ్మిడివరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఈనెల8 నుంచి 15వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాపోరు నిర్వహిస్తున్నట్టు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆండ్ర మాల్యాద్రి పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని తిల్లమ్మచెరువుగట్టు, జీఎంసీ బాలయోగి కాలనీల్లో సీపీఎం పార్టీ బృందం సోమవారం ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించింది. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని కరపత్రాలు పంపిణీ చేశారు. పేదలపై భారం మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ఈనెల14న కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని మాల్యాద్రి పిలుపునిచ్చారు. జిల్లా కమిటీ సభ్యుడు జి.దుర్గాప్రసాద్, దొమ్మేటి వీరరాఘవులు, ముడే చినసత్యనారాయణ, కాశి సత్యనారాయణ, పొలమూరి శ్రీనివాసరావు, లక్ష్మణరావు, జి.సాయిబాబు, జగడం శ్రీనివాసరావు, అహ్మద్ హుస్సేన్, యు.ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా రమణబాబు జన్మదిన వేడుకలు



అమలాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కూటమి నాయకుల ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మెట్ల స్వగృహం వద్దకు నియోజకవర్గం నలుమూలల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ సమక్షంలో రమణబాబు కేక్ కట్‌చేశారు. అమలాపురం అర్బన్ డెవలెప్‌మెంట్ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, పట్టణ, మండలశాఖల టీడీపీ అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ, మల్లుల పోలయ్య, దెందుకూరి సత్తిబాబురాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ పెచ్చెట్టి విజయలక్ష్మి, మాజీ జడ్పీటీసీలు అధికార జయవెంకటలక్ష్మి, చింతా శంకరమూర్తి, అల్లాడ శరత్‌బాబు, నల్లా స్వామి, జనసేన నాయకులు లింగోలు పండు, ఇసుకపట్ల రఘుబాబు, అధిక సంఖ్యలో కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు జన్మదిన వేడుకలు సోమవారం స్వగ్రామం కొమరగిరిపట్నంతో పాటు అల్లవరం, కోడూరుపాడు తదితర గ్రామాల్లో ఘనంగా జరిగాయి. రమణబాబు పాల్గొని కేక్ కట్ చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, మంతెన సురేష్‌రాజు, పిండి గణపయ్య, కొమ్మూరి సత్తిబాబు, వేగిరాజు వెంకట్రాజు, బండిగుప్తాపు సత్తిబాబు, నల్లా రాము, కడలి దేవిప్రసాద్, కొక్కిరిమెట్టి సుబ్రహ్మణ్యం, ముత్యాల బాబి పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

మామిడికుదురు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న ఓడలరేవు గ్రామానికి చెందిన నల్లి బాలకృష్ణను అరెస్టు చేసినట్టు నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలియచేశారు. అనుమానాస్పదంగా నిందితుడు కనిపించడంతో అతడిని ప్రశ్నించగా నగరం స్టేషన్ పరిధిలో మూడు, పాలకొల్లు స్టేషన్ పరిధిలో1, అమలాపురం టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో1 మోటారు సైకిల్‌ను దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నాడని, దీనిపై ఆదివారం రాత్రి కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ తెలిపారు. గతంలో రాజోలు స్టేషన్ పరిధిలో 27మోటారు సైకిళ్ల, అమలాపురంస్టేషన్ పరిధిలో 16మోటారు సైకిళ్లు దొంగిలించిన కేసులో అరెస్టు అయి మళ్లీ జైలు నుంచి విడుదలై మరలా దొంగతనాలకు పాల్పడుతున్నాడని ఎస్ఐ తెలిపారు.

పెండింగ్ నిధులు విడుదల చేయాలి

యానాం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఓఎన్జీసీ నుంచి మత్స్యకారులకు రావలసిన పెండింగ్ నష్టపరిహారం విడుదల చేయాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేస్ కుమార్‌ను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. పరిపాలనాధికారి మునిస్వామితో కలిసి కాకినాడ వెళ్లిన మల్లాడి ఈడీతో భేటి అయ్యారు. పెండింగ్‌లో ఉన్న 231మంది మత్స్యకారులకు సంబంధించిన రూ.6.37కోట్లు ప్రభుత్వ ఖాతాలో జమాచేయాలన్నారు. అలాగే అర్హులైన 5,520మంది మత్స్యకారులకు ఇంకా విడుదల చేయాల్సిన 5నెలల 14రోజులకు సంబంధించిన నిదులు విడుదల చేయాలని కోరారు. నాలుగు రోజుల్లో పరిహారం నిధులు జమ చేసేందుకు ఓఎన్జీసీ అధికారులు అంగీకారం తెలపారని మల్లాడి వివరించారు.

కొబ్బరి చెట్టు వద్ద శివలింగం: భక్తుల పూజలు



పి.గన్నవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో సోమవారం శివునికి ప్రీతి కరమైన రోజు, ఆ పర్వదినాన పంచలోహాలతో కూడిన సూక్ష్మ శివలింగం బయటపడింది. ఆ సూక్ష్మ శివలింగానికి స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొడపాటివారిపాలెంలో ప్రధాన రహదారి చెంతనే ఉన్న కొండాలమ్మ, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాలు వెనుక భాగంలో ఉన్న కొబ్బరి చెట్టు వద్ద నల్లత్రాచు పామును చూశానని గ్రామానికి చెందిన స్వప్న చెప్పారు. అలికిడికి పాము అటుగా వెళ్లిపోయిందని, సమీపంలోకి వెళ్లగానే అక్కడేసూక్ష్మ శివలింగం కనిపించిందని ఆమె తెలిపింది. ఈవిషయం గ్రామస్తులకు ఆమె వివరించింది. కార్తీక సోమవారం రోజున శివలింగం బయటపడిందని, ఇది సర్వేశురుడి మహిమగా భావించి స్థానికులు షామి యాను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవిషయం వ్యాప్తి చెందడంతో శివలింగాన్ని సందర్శించడానికి ప్రజలు తరలి వస్తున్నారు.

బెల్టుషాపు నిర్వాహకుల బైండోవర్

అమలాపురం టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అమలాపురం మండలంలో మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తున్న నలుగురిని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్కేడీవీ ప్రసాద్ ఆదేశాల మేరకు సోమవారం అమలాపురం తహశీల్దార్ కోర్టులో హాజరుపరిచారు. బెల్టు షాపులు నిర్వహిస్తున్న ఎస్.సురేష్‌కుమార్, జి.సత్యసూర్యవెంకటప్రసాద్, సానబోయిన శ్రీనివాసరావు, కేఎస్ రాజులను ఎక్సైజ్ ఎస్ఐ బాలాజీ బైండోవర్ చేయగా ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున ష్యూరిటీ తీసుకుని విడుదల చేసినట్టు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

బండారులంకలో అగ్నిప్రమాదం

అమలాపురంరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బండారులంక శివారు శ్మశానవాటిక చెంతన రేకులషెడ్డులో నివాసం ఉంటున్న ఇంట్లో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. రూ.1.50 లక్షల ఆస్తి నష్టం ఏర్పడిందని అమలాపురం అగ్నిమాపక అధికారి కేవీఎం కొండబాబు తెలిపారు. కార్తీక సోమవారం ఇంటి ఆవరణలో దీపాలు వెలిగించారు. ఎలుకల ప్రభావంతో ఆ దీపం నిప్పు ఇంటికి అంటుకోవడంతో ఇంట్లో నిద్రిస్తున్న కర్రి మణికంఠ, మరో పోర్షన్ ఉన్న రాయుడు దుర్గకు గాయాలయ్యాయి. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది మంటలనుఅదుపు చేశారు.

సాహిత్యానికి ప్రభుత్వం పెద్దపీట

యానాం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): యానాంలో సాహిత్యానికి ప్రభుత్వ పూర్తి సహకారం అందిస్తుందని ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఇటీవల జరిగిన కవుల దినోత్సవం సందర్భంగా సమావేశాలు ఏర్పాటుచేసుకోవడానికి ఉచితంగా మీటింగ్ హాల్ ఇవ్వాలని కవులు కోరారు. ఆ ప్రతిపాదనకు సీఎం ఆమోదం తెలిపారని, అనుమతి ప్రతాలను ఆర్ఏ మునిస్వామికి, విద్యాశాఖ డైరెక్టర్లకు అందించామని మల్లాడి తెలిపారు.

అబుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలు

అమలాపురం టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశ తొలి విద్యాశాఖ మంత్రి డాక్టర్ మౌలానాఅబుల్‌కలాం ఆజాద్ జయంతిని సోమవారం 13వ వార్డులోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ పాఠశాలలో కోనసీమ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీ గంటి హరీష్‌మాధుర్, జనసేన నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై ఆజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలు, విద్యార్థుల సమక్షంలో ఎంపీ హరీష్ కేక్ కట్‌చేసి విద్యార్థులకు పంచారు. అనంతరం విద్యార్థులకు ఎడ్యుకేషనల్ కిట్స్‌ను ఆయన అందజేశారు.

డిసెంబరు 14న జాతీయ లోక్‌అదాలత్..

అమలాపురంటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్ తెలిపారు. లోక్ అదాలత్ కేసులకు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

అబుల్ కలాం ఆజాద్ జయంతి

కొత్తపేట, నవంబరు11(ఆంధ్రజ్యోతి): కొత్తపేట విశ్వకవివేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం దేశమొట్టమొదటి విద్యాశాఖామంత్రి భారతరత్న మౌలాన అబుల్‌కలాం అజాద్ జయంతి వేడుకలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. అజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గ్రామసింహాలు హల్‌చల్.. ప్రజల బెంబేలు

- కుక్కల నివారణపై నిషేధంతో పెరిగిపోతున్న సంఖ్య
- గ్రామ పంచాయతీలకు సవాళ్లు
- పంచాయతీలకు కుక్కల దాడులపై ఫిర్యాదులు




ఆలమూరు మండలంలో కుక్కల గుంపు, కలవచర్లలో కుక్కకాటుకు గురైన వ్యక్తి

ఆలమూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కుక్కలు గ్రామాల్లో దాడులకు తెగబడుతున్నాయి.. ఈపరిస్థితి నుంచి ప్రజలను ఎలా రక్షించాలో సర్పంచ్‌లకు పెద్ద సవాళ్లుగా మారింది. గతంలో కుక్కలు ఎక్కువైన సమయంలో వాటిని నివారించేవారు. అయితే ఇటీవల కాలంలో కోర్టు తీర్పు ఆదేశాలతో కుక్కలను నివారించడం నేరమని పేర్కొనడంతో వాటిని పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో గుంపు గుంపులుగా తిరుగుతూ దాడులకు తెగబడుతున్నాయి. ఈదాడుల్లో అనేక మంది గాయాలపాలవుతున్నారు. మరిందరైతే మృత్యువాత పడుతున్నారు. రాత్రి సమయంలోనే కాదు పగటి పూట కూడా ఒంటరిగా బయటకు వెళ్లడం భయంగా ఉంటుంది. ఇటీవల ఆలమూరు మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు గ్రామాల్లో కుక్కల బెడదపై ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని నివారించకపోతే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు చూడాలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

అధిక సంఖ్యలో కేసులు నమోదు

గ్రామాల్లో కుక్కల బెడద తీవ్రతం కావడంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో అధిక సంఖ్యలో కుక్కల వల్ల గాయపడిన వారి కేసులు అధిక సంఖ్యలో నమోదవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నట్లుగా జిల్లా అధికారులు తెలుపుతున్నారు. ఆలమూరు మండలంలో ఉన్న మూడు ఆసుపత్రులలో ఈఏడాది ఇప్పటీవరకు నమోదు చేసుకున్న కుక్కకాటు కేసులు ఇలా ఉన్నాయి.

ఆసుపత్రి	నమోదైన కేసులు
చొప్పెల్ల పిహెచ్‌సీ	236
పెదపల్ల పిహెచ్‌సీ	96
ఆలమూరు సీహెచ్‌సీ	204

కుక్కకాటుకు గురైతే జాగ్రత్తలు తప్పనిసరి
డా.డి.సువక్షలానాయుడు, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాకారిని ఆలమూరు మండలం



కుక్కకాటుకు గురైన వ్యక్తి జాగ్రత్తలు పాటించాలి. రేబిస్ లక్షణాలు సాధారణంగా ఒకటి నుంచి మూడు నెలల వరకు కనిపిస్తాయి. ఈవైరస్ సోకిన వారిలో జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలు కనిపించవచ్చు. కాటు లేదా స్క్రాచ్ ప్రదేశంలో అసౌకర్యం, ప్రారంభ సంకేతాలుగా కనిపిస్తాయి. వైరస్ అభివృద్ధి చెందుతున్నప్పుడు గందరగోళం, అధిక లాలాజలం, మింగడంలో సమస్యలు, కండరాల నొప్పులతో సహా మరింత తీవ్రమైన లక్షణాలు బయటపడతాయి. నాడీ సంబంధిత లక్షణాలు సైతం కనిపించవచ్చు.

సంఖ్య పెరగకుండా చర్యలు ఒకటే మార్గం
డా.ఎల్.అనిత, వెటర్నరీ ఏడీ ఆలమూరు



కుక్కల సంఖ్య పెరగకుండా ఏబీసీ(కుటుంబ నియంత్రణ) ఒకటే మార్గం. అయితే ఏబీసీ ఆప రేషన్లు ప్రస్తుతం రాజమహేంద్రవరం, కాకినాడలలో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కోనసీమ జిల్లాలో ఎక్కడ లేదు. రేబిస్ రాకుండా కుక్కలు, పశువులకు వ్యాక్సిన్ వేయడానికి వ్యాక్సిన్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంది.

కుక్కకాటుకు గురై వృద్ధుడి మృతి

ఆలమూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కలవచర్లలో సోమవారం ఆలమూరు గ్రామానికి చెందిన వృద్ధుడు కుక్కకాటుకు గురై మృతి చెందారు. ఆలమూరుకు చెందిన అంగర సూర్యారావు (75) పనిమీద సోమవారం ఉదయం కలవచర్ల గ్రామానికి వెళ్లాడు. అక్కడ కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరచినట్లు స్థానికులు తెలిపారు. ఆయను ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సూర్యారావు బంధువులు తెలిపారు. కుక్కల దాడిలో ఎడమ కాలిపై తీవ్ర గాయమైంది. నరాలు తెగి తీవ్ర రక్తస్రవమైంది. వృద్ధుడు కావడం, ఒత్తిడికి గురికావడం, తీవ్ర గాయంతో రక్తస్రవం కావడంతో అతడు మృతి చెందాడని డాక్టర్ తెలిపారు.

విజయదుర్గా పీఠంలో ఘనంగా లక్ష బిల్వార్చన



పీఠంలో రుద్రాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గాపీఠంలో సోమవారం భవానీ శంకర అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. కార్తీక శుద్ధదశమి పురస్కరించుకుని పీఠంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి సుప్రభాతసేవ, తులసిదళ అర్చన, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పుష్పార్చన, భవానీ శంకరసమేత అష్టలింగేశ్వరస్వామికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, విజయదుర్గా అమ్మవారికి లక్షకుంకుమార్చనలు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అర్చనలు, అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన నిర్వహించారు. భక్తులకు కార్తీకమాసం విశిష్టతను పీఠాధిపతి గాడ్ వివరించారు. అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఠం ప్రతినిధులు జి.భాస్కరనారాయణ, సత్య వెంకటకామేశ్వరి, సత్య కనకదుర్గ, బి.రమ, పీఆర్వో బాబి, వేదపండితుడు చిమలకొండ వీరావధాని, అర్చకుడు చక్రవర్తుల మాధవాచార్యులు, శివభక్తులు పాల్గొన్నారు.

కుండలేశ్వరం.. భక్తజన సంద్రం

కాట్రేనికోన, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరంలో సోమవారం అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో సీనియర్ తెలుగుదేశం నాయకుడు నిమ్మకాయల జగ్గయ్యానాయుడు దంపతులు ఆలయ ప్రాంగణంలో రుద్ర హోమం, మృత్యుంజయ హోమం నిర్వహించారు. వేలాదిమంది భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయఆవరణలోని రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ దేవతలను భక్తులుదర్శించుకున్నారు. చెయ్యేరు, పి.లక్ష్మీవాడ, ఉప్పూడి, కాట్రేనికోన, నడవపల్లి, గెద్దనపల్లి, కందికుప్ప, పల్లంకుర్రు, మగసానితిప్ప శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయానికి తరలివచ్చిన భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన వసతిని నిమ్మకాయల వెంకటరంగయ్య కుమారుడు సీనియర్ టీడీపీ నాయకుడు జగ్గయ్యానాయుడుఏర్పాటుచేశారు.

రాయవరంలో ఘనంగా గౌరిదేవి గ్రామోత్సవం



గౌరిదేవి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం.

రాయవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాయవరంలో బసవేశ్వర దేవాంగ సంఘం ఆధ్వర్యంలో గౌరిదేవి గ్రామోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. గౌరిదేవి ఉత్సవం పురస్కరించుకుని అట్లతద్ది రోజున గౌరిదేవి ప్రతిరూపంగా భావించే వరిదుబ్బును తీసుకువచ్చి బసవేశ్వరుడు ఆలయంలో ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి 25 రోజులపాటు అమ్మవారికి పూజలు నిర్వహించడంతో పాటు కార్తీక దశమి రోజున గౌరిదేవి సోదరుడైన బసవేశ్వరుడ్ని తీసుకువచ్చి ప్రతిష్ఠ జరిపినట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన శివపుత్రుల వీరనాట్యాలు, తీన్మార్ వాయిద్యాలు, కేరళ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గౌరిదేవి జాతర నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ తెలిపారు. ఆంద్ర బసవరాజు, కుందు వీరభద్రరావు, ఆంద్ర సుకుమార్, నూలు వీరవెంకట సత్యనారాయణ, అల్లక సత్యనారాయణ, ఆంద్ర సత్యనారాయణ, బసవేశ్వర దేవాంగ సంఘం సభ్యులు , గ్రామస్థులు పాల్గొన్నారు.

నాటుసారాతో ఇద్దరి అరెస్టు

ఆలమూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడిలో స్కూటర్‌పై నాటుసారా తరలిస్తుండగా దాడి చేసి సారాతోపాటు ఇరువురు ముద్దాయిలను అరెస్టు చేశారు. ఆలమూరు ఎక్సైజ్ సిఐ ఐడీనాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన యార్లగడ్డ ప్రసాద్, యర్లగడ్డ రాజులు స్కూటర్‌పై నాటుసారా తరలిస్తుండగా మండపేట మండలం ఏడిద వద్ద దాడి చేసి పట్టుకుని 20లీటర్ల నాటుసారాతో వారు ఇరువురు, స్కూటర్‌ను అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈదాడిలో ఎస్‌ఐ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏజీపీ విద్యాప్రసన్నకు దళిత నాయకుల అభినందన

ఆలమూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆలమూరు జూనియర్ సివిల్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ పీడర్‌గా నియమితులైన బూసి విద్యాప్రసన్నను కొత్తపేట నియోజకవర్గ దళిత నాయకులు సోమవారం ఆలమూరులో సత్కరించారు. అతిచిన్న వయస్సులో ఏజీపీగా బాధ్యతలు స్వీకరించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. దళిత నాయకులు నల్లా వెంకటరమణ, కోనాల అంబేడ్కర్, బహుదూర్ పాలంగి రవిచంద్ర, సాలి సత్యనారాయణ, రాజశేఖర్, నెల్లి చిన్న, దిడ్డిరాము పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

మలికిపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధి నిధులతో గ్రామాలకు మహర్దశ అని మేడిచర్లపాలెం సర్పంచ్ ఎం.వల్లీశ్వరి అన్నారు. సోమవారం మేడిచర్లపాలెంలో రూ.14లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్నంనీడి పురుషోత్తమరావు, మల్లిపూడి సత్తిబాబు, మేడిచర్ల సాయిరామ్ పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విద్యాసాగర్

ఆత్రేయపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆత్మస్థైర్యంతో విద్యార్థినీలు ముందుకు నడవాలని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ పేర్కొన్నారు. సోమవారం ఆత్రేయపురం మహాత్మాగాంధీ విద్యాసంస్థలలో డీఎస్పీ ఆదేశాల మేరకు మహిళా సంరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వందలాది మంది విద్యార్థినీలు పాల్గొన్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఆడపిల్లలు ఎలా ఉండాలో సమాజంలో ఎలా ఉండాలి అనే అంశాలపై వివరించారు. ఎంతటి క్లిష్టపరిస్థితులు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగిపోవాలన్నారు. ఎదైన సమస్యలు ఉంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులకు సమాచారం అందించి తమ భవిష్యత్‌ను కాపాడుకోవాలన్నారు. అనేక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాము ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్ సేవలు ప్రసంసనీయం

కె.గంగవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ సహాయకునిగా శ్రీరామ్ చేసిన సేవలు ప్రసంసనీయం అని వక్తలు అన్నారు. పాణింగపల్లి సచివాలయంలో వ్యవసాయశాఖ సహాయకునిగా పనిచేసి పదోన్నతి పొంది బదిలీ అయిన శ్రీరామ్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. శ్రీరామ్‌ను సన్మానించారు. సర్పంచ్ చీకట్ల సునీత గోపాలం, వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాల కొండ, కూటమి నాయకులు కొత్తపల్లి మురార్జీ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

ఆలమూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఆలమూరులో కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ సోమవారం పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే పోలింగ్ కేంద్రం పరిశీలించి సౌకర్యాలపై ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు, తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రానికి అందుబాటులో మరుగుదొడ్లు ఉండాలన్నారు. అలాగే ఇతర వివరాలను సేకరించారు.



ఆలమూరు మండల పరిషత్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు ఇవ్వాలని నిర్ణయం

ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన... మిల్లర్ల గుర్రు వార్తపై వివరణ

మండపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన మిల్లర్లు గుర్రు వార్తకు జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఎం.బాల సరస్వతి వివరణ ఇచ్చారు. ఈనెల 8వ తేదిన రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో జరిగిన సంప్రదింపులలో మిల్లర్లు సిఎంఆర్ ద్వారా బియ్యంలో కలిపే ఎఫ్‌కెఆర్ క్వాలిటీ గురించి మిల్లర్లు జిల్లాను యూనిట్‌గా పరిగణించాలని అన్ని రైతు సేవా కేంద్రాల్లోను అన్ని రైస్ మిల్లులను అనుసంధానం చేయా లని కోరారు. దీనిపై జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రభుత్వ ఆదేశానుసారం తగు చర్యలు తీసుకుంటామని మిల్లర్లను ఒప్పించడం జరి గింది. సోమవారం నుంచి మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు ఇవ్వాలని నిర్ణయించారు. దీని ప్రకారం సోమవారం 13 మండలాలనుంచి రూ. 94,60,00,000(తొంభై నాలుగు కోట్ల అరవై లక్షలు) బ్యాంకు గ్యారంటీలు వచ్చినట్లు ఆమె వివరించారు. బ్యాంకు గ్యారంటీలు సమర్పించిన రైస్ మిల్లులు వెంటనే ఆప్షన్‌లో కనిపిస్తున్నాయన్నారు. కావున రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారాకోరిన రైస్ మిల్లులకు రైతులు ధాన్యం తోలుకోవచ్చునని చెప్పారు.

మార్క్‌ఫెడ్ సమావేశం

మలికిపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అమరావతిలో సోమవారం జరిగిన రాష్ట్ర మార్క్‌ఫెడ్ మొదటి సమావేశంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్, రాజోలు జనసేన పార్టీ సమన్వయకర్త గుండుబోగుల పెద్దకాపు పాల్గొన్నారు. సమావేశంలో మార్క్‌ఫెడ్‌కు సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్టు ఆయన తెలిపారు.



కపిలేశ్వరపురం మండలం వల్లూరులో స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం చేస్తున్న పండితులు



కె.గంగవరం మండలం యండగండి శివాలయంలో అభిషేకం చేస్తున్న అర్చకుడు



ఆలమూరు మండలం మూలస్థానంలో మూలేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు



కొత్తపేట మండలం పలివెల ఉమాకొప్పేశ్వరస్వామికి నారికేళ పంచామృతాభిషేకాలు చేస్తున్న అర్చకులు

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

- ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- బారులుతీరిన భక్తజనం

కపిలేశ్వరపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. కపిలేశ్వరపురం, అంగర, టేకి, మాచర, కోరుమిల్లి తదితర గ్రామాల మహిళలు, భక్తులు గౌతమీ నదిలో వేకువజామునే స్నానం చేసి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. కపిలేశ్వరపురం పాపవినాశేశ్వరస్వామి ఆలయంలో అర్చకులకు పలువురు భక్తులు నైవేద్యాలు అందించారు.

అయ్యప్పస్వామికి లక్షబిల్వార్చన: మండలంలోని అంగర గుడివీధి రామాలయం వద్ద ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి లక్షబిల్వార్చన జరిగింది. గురుస్వామి ఆధ్వర్యంలో ముక్కామల కామేశ్వరశర్మ పర్యవేక్షణలో అయ్యప్పస్వామికి పడిపూజ, తేటతుళ్ళి 18 కలశాల పూజ, లక్షబిల్వార్చన తదితర పూజలను జరిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో అయ్యప్పస్వాములు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఆత్రేయపురం మండలం ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయంలో బారులుతీరిన భక్తులు

ఘనంగా ఏకాదశ రుద్రాభిషేకం: వల్లూరులో నున్న పార్వతీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని సోమవారం ఏకాదశ రుద్రాభిషేకం జరిపారు. ఈనెల 13 వరకు శ్రీకంఠం మల్లేశ్వరశర్మ అర్చకత్వంలో రోజూ స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజ జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపారు. బుధవారం అన్నసమారాధన, సాయంత్రం నందీశ్వరునికి అభిషేకం, రుద్రహోమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

కె.గంగవరం: కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాల్లో పూజలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. స్వామి వారికి భక్తులు అభిషేకాలు చేశారు. యండగండి, పామర్రు, అముజూరు, పాణింగపల్లి, సత్యవాడ, గంగవరం, మసకపల్లి, భట్లపాలిక, బాలాంత్రం, కుందూరు గ్రామాల్లోని శివాలయాలు కిటకిటలాడాయి. కుందూరులోని భ్రమరాంబిక సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో అన్నసమారాధన చేశారు.

ఆలమూరు: కార్తీక సోమవారం సందర్భంగా ఆలమూరు మండలంలో శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తుల రాకతో ఆలయాల్లో సందడి నెలకొంది. ఆలమూరు విక్రమభట్టీశ్వరస్వామి, మూలస్థానం, చొప్పెల్ల, మడికి, జొన్నాడ, పెనికేరు, నర్సిపూడి, నవాబుపేట, మోదుకూరు, గుమ్మిలేరు, పెదపళ్ల, పినపళ్ల, చింతలూరు, సందిపూడి, కలవచర్ల గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు.

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయం భక్తులతో సందడి నెలకొంది. ఆలయంలో మహిళలు దీపాలంకరణ చేశారు. శివుడిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. వేకువజామునే శివుడికి పంచామృత అభిషేకం చేశారు. వాడపల్లిలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తులు బారులుతీరి స్వామివారిని దర్శించుకున్నారు. ఇళ్ల వద్ద భక్తులు కేదారేశ్వరస్వామి వ్రతం చేశారు.

కొత్తపేట: పలివెల ఉమాకొప్పిలింగేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. అర్చకులు స్వామివారికి నారికేళ పంచామృతాలతో అభిషేకాలు చేశారు. దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకున్నారు.

రావులపాలెం: రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడు ఉమా వీరేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు భాస్కరకిరణ్ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన చేశారు. భక్తులు శివలింగ ఆకారంలో ప్రమిదలను ఏర్పాటు చేసి పుష్పాలతో అలంకరించారు. భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేసి తమ భక్తిని చాటుకున్నారు.

రాయవరం: మండలంలోని సోమేశ్వరం బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి, వెంటూరు ఉమా సోమేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమేశ్వరంలో పురోహితులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. రాయవరం పార్వతీ సమేత రాజరాజేశ్వరస్వామి ఆలయంలో విలపర్తి ఫణిధరశర్మ, శశిధరశర్మ ఆధ్వర్యంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు జరిపారు. రాయవరం తుల్యబాగ సమీపంలో ఉన్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో, చెల్లూరు అగస్త్యేశ్వర స్వామి, లొల్ల రామలింగేశ్వరస్వామి, పసలపూడి శివాలయం, మాచవరం శివాలయా ల్లో వేకువజాము నుంచి భక్తులతో కిటకిటలాడాయి.



రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడు వీరేశ్వరస్వామి ఆలయంలో జ్యోతిర్లింగార్చన



రాయవరంలో ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరం బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి




వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న భక్తులు. పక్క చిత్రంలో ఆలయ మాడవీధులను పరిశీలిస్తున్న ఉపకమీషనరు, సీఐ

వెంకన్న ఆదాయం రూ.3.04లక్షలు

ఆత్రేయపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. నోము ఆచరిస్తున్న భక్తులు స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపి మొక్కులు చెల్లించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.3,04,521 వచ్చినట్టు ఉపకమీషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు: ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉప కమిషనరు సూర్యచక్రధరరావు చర్యలు చేపడుతున్నారు. సోమవారం ప్రదక్షిణలు జరిపే మాడవీధుల్లో రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాముతో కలిసి చర్చించారు. పార్కింగ్, ప్రదక్షిణలు జరిపే వీధులు, అన్నప్రసాదం వద్ద భక్తుల రద్దీగా ఉండే ప్రాంతాల్లో పర్యటించి పోలీసులతో చర్చించారు.



రావులపాలెం మండలంలో గింజ తయారీ దశలో ఉన్న వరి పొలాలు

వాయుగుండంతో అన్నదాతల ఆందోళన

రావులపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడి విస్తారంగా వర్షాలు కురుస్తాయని ప్రసార మాధ్యమాల్లో వార్తలు రావడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. మండలంలోని వరి పొలాలు కొన్ని ప్రాంతాల్లో కోత దశకు చేరుకోగా మరి కొన్ని ప్రాంతాల్లో గింజ తయారీ దశలో ఉన్నాయి. వాయుగుండం వల్ల సోమవారం రాత్రి చిరుజల్లులు పడుతుండటంతో చేతికి అంది వచ్చిన పంట చేతికి అందకుండా పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికి అందివచ్చిన సమయంలో ఇలా వర్షాలు కురిస్తే ఆశించిన దిగుబడి, తగిన ధర రాక నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మరణానంతరం కళ్లు దానం

ఆలమూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మరణానంతరం తన కళ్లు మరొకరికి చూపును ప్రసాదించాలన్న లక్ష్యంతో ఆలమూరు గ్రామానికి చెందిన వెత్సా నరసింహమూర్తి కళ్లు దానం చేశారు. ఆదివారం ఆయన మృతి చెందడంతో కుటుంబ సభ్యుల సమాచారం మేరకు ఐబ్యాంక్ సిబ్బంది ఆయన కళ్లను సేకరించారు. కాకినాడ బాదం బాలకృష్ణ ఐబ్యాంక్‌కు ఆయన కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. దీంతో వారు ఆలమూరుకు చేరుకుని కళ్లను సేకరించారు. దాత ఆశయాన్ని అమలు చేయడంలో వారి కుటుంబ సభ్యులను ఐ బ్యాంక్ సిబ్బంది అభినందించారు.

నరసింహమూర్తి మృతికి పలువురు సంతాపం: ఆలమూరు మండల ఆర్యవైశ్య సంఘ నాయకులు, రైస్‌మిల్లర్ వెత్సా నరసింహమూర్తి(80) ఆదివారం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈయన మృతి పట్ల మండల ఆర్యవైశ్య సంఘ నాయకులు, పలువురు ప్రజాప్రతనిధులు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.